# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జనం రిపోర్టర్ జన శ్రేయస్సే మా బాధ్యత








సంపుటి : 01 సంచిక : 215, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజిలు : 08, వెల రూ. 5రూ/ శనివారం -30 - నవంబర్ - 2024

Published From, Srikakulam : Circulated at,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool , Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## మహారాష్ట్రలో బైక్‌ను తప్పించబోయి

## బస్సు బోల్తా... 9 మంది మృతి



గోండియా జిల్లాలో ప్రమాద ఘటన

భండారి నుంచి గోండియా వెళ్తున్న బస్సు బోల్తా

పరారీలో ఉన్న డ్రైవర్ కోసం పోలీసులు గాలింపు

## బంగాళాఖాతంలో 'ఫెంగల్' తుపాను... కృష్ణపట్నం, నిజాంపట్నం పోర్టుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక



నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

నేడు తుపానుగా మారనుందని ఐఎండీ వెల్లడి

రేపు కారైక్కాల్-మహాబలిపురం వద్ద తీరం దాటే అవకాశం

## ఛాంపియన్స్ ట్రోఫీ కోసం

## భారత జట్టు పాకిస్థాన్ వెళ్లదు: కేంద్రం స్పష్టీకరణ



వచ్చే ఏడాది పాకిస్థాన్ గడ్డపై ఛాంపియన్స్ ట్రోఫీ

భారత జట్టు పాకిస్థాన్ వెళ్లదన్న బీసీసీఐ

తాజాగా బీసీసీఐ నిర్ణయాన్ని సమర్థించిన భారత విదేశాంగ శాఖ



మహారాష్ట్ర సీఎం పదవిపై ఉత్కంఠ...

## ఏక్‌నాథ్ షిండే సొంతూరు వెళ్లడంతో సమావేశం రద్దు

- అమిత్ షాతో భేటీ అయిన మహాయుతి కూటమి నేతలు
- నేడు సమావేశమై ముఖ్యమంత్రిని నిర్ణయిస్తామన్న నేతలు
- అనూహ్యంగా తన సొంతూరుకు వెళ్లిన ఏక్‌నాథ్ షిండే

# అమరావతి రాజధాని...

# ఎవరూ కదల్చకుండా బాబు మాస్టర్ ప్లాన్

అందుకే 2024లో వైసీపీకి దిమ్మదిరిగేలా తీర్పు ఇచ్చారు

ఏపీకి రాజధాని లేకపోవడం దాని మీద కామెంట్స్ అన్నీ అయిదు కోట్ల ఏపీ జనాలను విపరీతంగా బాధించాయి

మూడు ప్రాంతాల ప్రజల మనోభావాలతో వైసీపీ రాజకీయం చేసిరేది

రాజధానిని 2027 నాటికల్లా ఒక షేప్ కు తీసుకురావాలని టీడీపీ కూటమి తలపోస్తోంది

డిసెంబర్ నెలాఖరులోగా అమరావతి ఏపీకి రాజధాని అని కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ చేస్తుంది



అమరావతి : ఏపీకి రాజధాని ఏది అంటే ఏమో అనేలా ఉండేది గత అయిదేళ్ల వైసీపీ ఏలుబడిలో పరిస్థితి. ఇలా ఎందుకు అంటే మూడు రాజధానులు అంటూ నాడు వైసీపీ ప్రభుత్వం చేసిన రాజకీయ విన్యాసం ఆ రేంజిలో ఉంది మరి అంటారు. ఆఖరికి రాజధాని ఏపీకి ఉందా లేదా అన్నది కూడా అర్థం కాకుండా పోయింది. అదొక జోక్ గా కూడా అంతా చెప్పుకునే విషాదంగా మారింది. / నిజానికి ఎంతో చరిత్ర కలిగిన ఏపీకి రాజధాని లేకపోవడం దాని మీద కామెంట్స్ అన్నీ అయిదు కోట్ల ఏపీ జనాలను విపరీతంగా బాధించాయి. మిగతా..2లో

## రేవంత్ రెడ్డికి గ్రామాల్లోకి వెళ్లి ఏడాది పాలనపై తెలుసుకునే దమ్ముందా?: కేటీఆర్



కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదన్న కేటీఆర్

కరీంనగర్ బీఆర్ఎస్ జన్మస్థలం.. పునర్జన్మను కూడా ఇచ్చిందన్న కేటీఆర్

ఉద్యమంలో లేని వాళ్లు తెలంగాణ గురించి మాట్లాడుతున్నారని విమర్శ

## దిలావర్‌పూర్ కంపెనీకి అనుమతులపై పూర్తి వివరాలు బయటపెట్టిన తెలంగాణ ప్రభుత్వం

- కేంద్రం ఫ్యూయల్ ఇథనాల్‌కు మాత్రమే అనుమతిచ్చిందని వెల్లడి
- ఇథనాల్, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ స్పిరిట్‌కు కేబినెట్ అనుమతిచ్చిందని వెల్లడి
- ఫ్యూయల్ ఇథనాల్ సాకుతో అనుమతులు ఇచ్చినట్లు వెల్లడి

## అందుకు వైఎస్ జగన్‌కి ఆస్కార్ ఇవ్వాలి.. దమ్ముంటే ఆయన సవాల్‌ను స్వీకరించాలి..



- మరోసారి సెకీ ఒప్పందం విషయమై 'ఎక్స్' వేదికగా జగన్‌పై షర్మిల విమర్శలు
- అబద్ధాలను అందంగా అల్లడంలో మాజీ సీఎంకు ఆస్కార్ ఇవ్వాలని ఎద్దేవా
- అదానీ వల్ల ఆర్థికంగా లబ్ధి పొందలేదని బైబిల్ మీద ప్రమాణం చేయాలంటూ సవాల్

# కాంగ్రెస్ కర్కశత్వం కారణంగా

# తెలంగాణ ప్రజల్లో నిప్పు పుట్టింది

తెలంగాణ చరిత్రలో కేసీఆర్ హిమాలయమైతే.. నువ్వు ఆయన కాలిగోటికి కూడా సరిపోవు.. రేవంత్‌కు కేటీఆర్ చురకలు

ప్రజల గుండెల్లో మాత్రం కేసీఆర్ అంటేనే ఎనలేని అభిమానం ఉందని కేటీఆర్

కానీ కేసీఆర్ 2001లో తెలంగాణ కోసం పార్టీ పెట్టినప్పుడు రాజకీయంగా ఆయనకు 46 ఏళ్ల మాత్రమే

14 ఏళ్ల ఎదురుదెబ్బలు, విజయాలు, అపజయాలు, ఆటుపోట్లు ఎన్నో ఎదుర్కొన్నారు

ఎన్నో అబద్ధపు హామీలు, ఆరు గ్యారంటీలు, నంగనాచి మాటలు చెప్పి కాంగ్రెస్ వాళ్లు అధికారంలోకి వచ్చారు



హైదరాబాద్ : తెలంగాణ చరిత్రలో కేసీఆర్ హిమాలయమైతే.. నువ్వు ఆయన కాలిగోటికి కూడా సరిపోవు అని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చురకలంటించారు. నీకు అధికారం ఉండొచ్చు.. కానీ ప్రజల గుండెల్లో మాత్రం కేసీఆర్ అంటేనే ఎనలేని మిగతా..2లో

## నిన్న 'ఇథనాల్'.. నేడు 'లగచర్ల'..

# రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

- కొడంగల్ పరిధి లగచర్లలో ఫార్మా క్లస్టర్ ను వ్యతిరేకిస్తూ ప్రజలు అధికారులపై దాడులకు దిగారు
- ప్రభుత్వం వారిని ఉపశమింపజేసేలా ఉన్నతాధికారులను పంపింది
- బీఆర్ఎస్ హయాంలోనే దీనికి అనుమతులు మంజూరు చేశారంటూ ఆధారాలను విడుదల చేసింది
- ఈ మేరకు మినహాయింపు కోసం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కంపెనీ అద్దదారులు అనుసరించిందని ప్రభుత్వం మండిపడింది



హైదరాబాద్ : ప్రజల కోణంలో తెలంగాణలో వరుసగా పరిణామాలు జరుగుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్ పరిధి లగచర్లలో ఫార్మా క్లస్టర్ ను వ్యతిరేకిస్తూ ప్రజలు అధికారులపై దాడులకు దిగారు. ఇంతలోనే నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ లో ఇథనాల్ పరిశ్రమను మిగతా..2లో

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కేటీఆర్‌పై కొండా సురేఖ సంచలన ఆరోపణలు




గురుకులాల్లో కుట్రల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం ఉందని ఆరోపణ

గతంలో గురుకులాల కార్యదర్శిగా పని చేశారన్న కొండా సురేఖ

ఏదో తప్పు చేసినందువల్లే పదేపదే జైలుకు పోతానని కేటీఆర్ అంటున్నాడని వ్యాఖ్య

## కాకినాడ పోర్టు నుంచి అక్రమ రవాణాపై

# ప్రధాని మోదీకి లేఖ సిద్ధం చేయండి



కాకినాడ పోర్టు నుంచి అక్రమ రవాణా జరుగుతోందన్న పవన్

పోర్టు నుంచి అక్రమ రవాణా తీవ్రమైన అంశం అని వెల్లడి

ఉగ్రవాదులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన

అమరావతి : కాకినాడ పోర్టు నుంచి బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని కూటమి నేతలు గత ప్రభుత్వ హయాం నుంచి తీవ్ర ఆరోపణలు చేస్తు న్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో... కాకినాడ పోర్టు అంశంపై ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించారు.

## మహారాష్ట్రలో బైక్‌ను తప్పించబోయి
# బస్సు బోల్తా... 9 మంది మృతి

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ బైక్‌ను తప్పించబోయి బస్సు బోల్తా పడటంతో 9 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్రంలోని గోండియా జిల్లాలో చోటు చేసుకుంది. భండారి నుంచి గోండియా వెళుతున్న బస్సుకు కోహ్‌మారా హైవే వద్ద ఎదురుగా బైక్ వచ్చింది. ఈ బైక్‌ను తప్పించే క్రమంలో డ్రైవర్ బస్సును మరోవైపుకు తిప్పాడు. దీంతో బస్సు బోల్తా పడిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బోస్సు బోల్తా పడిన తర్వాత డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంపై బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం దురదృష్టకరమన్నారు. మృతులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు అవసరమైన వైద్య సాయం అందించాలని అన్నారు. ప్రమాదం విషయం తెలియగానే అధికారులు, వైద్యులు సంఘటన స్థలానికి వెళ్లారు.

## బంగాళాఖాతంలో 'ఫెంగల్' తుపాను... కృష్ణపట్నం, నిజాంపట్నం పోర్టుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక

అమరావతి : నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం తుపానుగా మారనుందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) అమరావతి విభాగం వెల్లడించింది. ప్రస్తుతం ఈ తీవ్ర వాయుగుండం చెన్నైకి ఆగ్నేయంగా 380 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది తుపానుగా మారిన తర్వాత వాయవ్య దిశగా పయనిస్తూ (నవంబరు 30) మధ్యాహ్నానికి కారైక్కాల్-మహాబలిపురం మధ్య తీరం దాటనుంది. ఈ తుపానుకు ఐఎండీ 'ఫెంగల్' అని నామకరణం చేసింది. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమలో ఇవాళ, రేపు కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని ఐఎండీ వెల్లడించింది. నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. దక్షిణ కోస్తాలో గరిష్ఠంగా గంటకు 75 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టం చేసింది. ఇప్పటికే వేటకు వెళ్లిన వారు వెంటనే తీరానికి చేరుకోవాలని సూచించింది. కాగా, తుపాను నేపథ్యంలో, ఏపీలోని కృష్ణపట్నం, నిజాంపట్నం పోర్టుల్లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాష్ట్రంలోని మిగిలిన పోర్టుల్లో ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

## ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు పాకిస్థాన్ వెళ్లదు: కేంద్రం స్పష్టీకరణ

న్యూఢిల్లీ : పాకిస్థాన్ వేదికగా జరగాల్సిన ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ, షెడ్యూల్, వేదికలపై ఐసీసీ కీలక సమావేశం జరగనున్న నేపథ్యంలో, భారత కేంద్ర ప్రభుత్వం ఆసక్తికర ప్రకటన చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్థాన్ లోనే జరిగేట్టయితే భారత జట్టు పాల్గొనదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దీనిపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించిన వ్యవహారంపై బీసీసీఐ ఇప్పటికే ఓ ప్రకటన విడుదల చేసిందని, బీసీసీఐ చెప్పినట్టుగానే భారత జట్టు పాకిస్థాన్ వెళ్లబోవడంలేదని తెలిపారు. బీసీసీఐ నిర్ణయాన్ని తాము సమర్థిస్తున్నామని పేర్కొన్నారు. పాకిస్థాన్ లో భద్రతా పరమైన సమస్యలు ఎదురవుతాయని బీసీసీఐ ఆందోళన చెందుతోందని, జైస్వాల్ చెప్పారు. అందుకే టీమిండియాను పాకిస్థాన్ పంపించడంలేదని అన్నారు. కాగా, టీమిండియా పాకిస్థాన్ వెళ్లడంలేదన్న ప్రకటనల నేపథ్యంలో... హైబ్రిడ్ మోడల్ లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. హైబ్రిడ్ మోడల్ అంటే... కొన్ని మ్యాచ్ లు పాకిస్థాన్ లో, మరికొన్ని మ్యాచ్ లు ఇతర దేశాల్లోని వేదికలపై నిర్వహిస్తారు. అయితే, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మాత్రం హైబ్రిడ్ మోడల్ కు తాము అంగీకరించేది లేదని తెగేసి చెబుతోంది. ఈ నేపథ్యంలో, ఇవాళ జరగాల్సిన ఐసీసీ కీలక సమావేశం రేపటికి వాయిదా పడే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

## మహారాష్ట్ర సీఎం పదవిపై ఉత్కంఠ... ఏక్‌నాథ్ షిండే సొంతూరు వెళ్లడంతో సమావేశం రద్దు

న్యూఢిల్లీ : మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరనే అంశంపై ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అనూహ్యంగా సతారా జిల్లాలోని తన స్వగ్రామానికి వెళ్లారు. దీంతో జరగాల్సిన మహాయుతి కూటమి సమావేశం రద్దైంది. ఈ సమావేశంలో సీఎం అభ్యర్థిని ఖరారు చేస్తారని భావించారు. కానీ ఆపద్ధర్మ సీఎం అందుబాటులో లేకపోవడంతో భేటీ రద్దై... ప్రభుత్వం ఏర్పాటు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. నిన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మహాయుతి నేతలు ఏక్‌నాథ్ షిండే, దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్ సమావేశమయ్యారు. మహారాష్ట్ర సీఎం పదవిపై ఒకటిరెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వ ఏర్పాటుపై అమిత్ షాతో సానుకూల చర్చలు జరిగాయని, ముంబైలో మరోసారి సమావేశమై చర్చిస్తామని, ఆ తర్వాత నిర్ణయం ప్రకటిస్తామని ఏక్‌నాథ్ షిండే నిన్న తెలిపారు.అమిత్ షాతో నిన్నటి భేటీ, సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం విషయమై ఈ రోజు మహాయుతి నేతలు భేటీ కావాల్సి ఉంది. కానీ షిండే లేకపోవడంతో రద్దైనట్లుగా జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఆయన తన గ్రామం నుంచి తిరిగి వచ్చాక సమావేశం జరగవచ్చని చెబుతున్నారు.

## రేవంత్ రెడ్డికి గ్రామాల్లోకి వెళ్లి ఏడాది పాలనపై తెలుసుకునే దమ్ముందా?: కేటీఆర్

హైదరాబాద్ : తన ఏడాది పాలనపై రేవంత్ రెడ్డి ప్రతి గ్రామానికి, బస్తీకి, తండాకు వెళ్లి తెలుసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. అలా వెళ్లి తెలుసుకునే దమ్ముందా? అని సవాల్ చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదన్నారు. గురుకులాల్లోని విద్యార్థులు కూడా మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం పరిస్థితి ఇది అన్నారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సమితికి కరీంనగర్ జన్మస్థలమని, ఆ తర్వాత కూడా తమ పార్టీకి కరీంనగర్ పునర్జన్మ ఇచ్చిందన్నారు. పదవీ త్యాగంతో పార్టీని ప్రారంభించి... ప్రాణత్యాగానికి సిద్ధపడి రాష్ట్రాన్ని సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అన్నారు. 1969లో తెలంగాణ కోసం 370 మంది అమరులయ్యారని, వారి సాక్షిగా బీఆర్ఎస్ (టీఆర్ఎస్) మొదటిసారి ఎన్నికల్లో సీట్లు గెలుచుకుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కృషి ఎనలేనిదన్నారు. కేసీఆర్ పదవుల కోసం ఆశించకుండా తెలంగాణ కోసమే ఉద్యమించారన్నారు. కేసీఆర్ అనేది సాధారణ పేరు కాదని... తెలంగాణ పోరు అని అభివర్ణించారు. ఉద్యమంలో అడ్రస్ లేనివాళ్లు ఇప్పుడు తెలంగాణ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉద్యమకారుల పైకి తుపాకి ఎక్కుపెట్టిన రేవంత్ రెడ్డి కూడా ఇప్పుడు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకుంటే అడుక్కుతినేవాళ్లమన్నట్లుగా మాట్లాడటం సరికాదన్నారు. తెలంగాణలోని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మరోసారి పోరుబాట పట్టాల్సి వస్తోందన్నారు. రేవంత్ రెడ్డి వద్ద ఇప్పుడు అధికారం ఉందని, కానీ ప్రజల అభిమానం మాత్రం కేసీఆర్, గులాబీ జెండాకే ఉందన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణ చరిత్రలో కేసీఆర్ హిమాలయ పర్వతమంత ఎత్తులో ఉంటే కాంగ్రెస్ ఆయన కాలి గోటికి కూడా సరిపోదన్నారు.

## దిలావర్‌పూర్ కంపెనీకి అనుమతులపై పూర్తి వివరాలు బయటపెట్టిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్ : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ లోని ఇథనాల్ కంపెనీకి సంబంధించిన వివరాలను తెలంగాణ ప్రభుత్వం బయటపెట్టింది. ఇక్కడ ఇథనాల్ కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించింది. ఇథనాల్ కంపెనీకి అనుమతులు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించింది. ఇక్కడ పర్యావరణ అనుమతులను కూడా గత ప్రభుత్వం ఉల్లంఘించినట్లు తెలిపింది. ఇక్కడ ఫ్యూయల్ ఇథనాల్‌కు మాత్రమే కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొంది. గత ప్రభుత్వం కేంద్రం అనుమతులను పట్టించుకోలేదని తెలిపింది. ఇథనాల్, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్‌కు గత ప్రభుత్వ కేబినెట్ అనుమతులు ఇచ్చిందని తెలిపింది. ఇండస్ట్రియల్ స్పిరిట్స్, అబ్జల్యూట్ ఆల్కహాల్‌కు కూడా నాటి కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించింది. ఫ్యూయల్ ఇథనాల్ సాకుతో కంపెనీకి అనుమతులు ఇచ్చినట్లు తెలిపింది. మినహాయింపుల కోసం కంపెనీ అడ్డదారులు తొక్కిందని వెల్లడించింది. గత ప్రభుత్వ మంత్రివర్గంలోనే పీఎంకే డిస్టిల్లేషన్స్ కంపెనీకి అనుకూలంగా అనుమతులు ఇచ్చారని తెలిపింది. కేంద్ర పర్యావరణ అనుమతి ప్రకారం స్థానిక సంస్థల ఎన్‌వోసీ తీసుకోవాలని తెలిపింది. కానీ స్థానిక సంస్థల అనుమతులు లేకుండానే కాంపౌండ్ వాల్ కూడా నిర్మించినట్లు వెల్లడించింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అండతో పీఎంకే డిస్టిలేషన్స్ నిబంధనలు ఉల్లంఘించిందని పేర్కొంది. 2022 అక్టోబర్ 22న గత ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇండెంట్ జారీ చేసిందని తెలిపింది. 600 లక్షల లీటర్ల ఇథనాల్, ఇతర ఉత్పత్తులకు గత ప్రభుత్వం ఎన్‌వోసీ జారీ చేసినట్లు వెల్లడించింది. 2022 డిసెంబర్‌లో కేబినెట్ ఈ నిర్ణయాన్ని ర్యాటిఫై చేసిందని వెల్లడించింది. ఈ కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణ నుంచి మినహాయింపు పొందిందని తెలిపింది. కంపెనీ స్వీయ ధృవీకరణ ఆధారంగా మినహాయింపు ఇచ్చినట్లు వెల్లడించింది. 2023 ఫిబ్రవరి 24న కేంద్రం ఫ్యూయల్ ఇథనాల్‌కు, 2023 జూన్ 15 నాటికే నీటి కేటాయింపులకు, 2023 డిసెంబర్ 7కు ముందే టీఎస్ఐపాస్ ద్వారా అనుమతులు ఇచ్చినట్లు తెలిపింది.

# అమరావతి రాజధాని... ఎవరూ కదల్చకుండా బాబు మాస్టర్ ప్లాన్



మొదటి పేజి తరువాయి

ఇది విభజన కంటే కూడా అతి పెద్ద గాయంగా మనసులను కలచివేసింది. అందుకే 2024లో వైసీపీకి దిమ్మదిరిగేలా తీర్పు ఇచ్చారు. కూటమికి చరిత్రలో నిలిచిపోయేలా 164 సీట్లను కట్టబెట్టి ఏలుకోమని భారీ చాన్స్ ఇచ్చారు. ఇదిలా ఉంటే 2014లో విభజన ఏపీలో తొలిసారి సీఎం గా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు చాలా దూరదృష్టిలో అమరావతి రాజధాని నిర్మాణానికి తలపెట్టారు. ప్రపంచ రాజధానిగా చేయాలని అనుకున్నారు. గొప్ప గొప్ప డిజైన్లు వేయించారు. నవ నగరాల నిర్మాణం అని కూడా ప్రతిపాదించారు. పేరెన్నిక గన్న ప్రఖ్యాత సంస్థలను అమరావతి రాజధానికి రప్పించి పెట్టుబడులు పెట్టించారు. వారికి భూ కేటాయింపులు చేశారు. అన్నీ అనుకున్నట్లుగా జరిగే ఈ పాటికి అమరావతి ఒక రూపునకూ షేపునకూ వచ్చేది అని అంటున్నారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధానిని కదపాలని చూసింది అన్న విమర్శలు ఎదుర్కొంది. అమరావతిని ఏమీ చేయడం లేదు అది శాసన రాజధానిగా ఉంటుందని వైసీపీ చెప్పినా అక్కడ తట్టెడు మట్టి వేసి ఏదైనా అభివృద్ధి పని తలపెట్టకపోవడంతో పాటు విశాఖను ఎగ్జిక్యూటివ్ కేపిటల్ అంటూ ప్రచారం చేయడం తో కథ రివర్స్ అయింది. పోనీ విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ అయినా చేశారా అంటే అదీ లేదు. కర్నూల్ కి హై కోర్టు అన్నారు కానీ అక్కడ కూడా ఏమీ జరగలేదు. ఇలా మూడు ప్రాంతాల ప్రజల మనోభావాలతో వైసీపీ రాజకీయం చేసిందని ప్రత్యర్థి పార్టీలు చేసిన ప్రచారమే జనాగ్రహానికి కారణం కూడా అయింది. మొత్తానికి వైసీపీని ఘోరంగా మూడు ప్రాంతాలలోనూ ఓడించేశారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తన తొలి ప్రాధాన్యత అమరావతి మీదనే ఉంచింది. అమరావతిలో గత అయిదేళ్ళలో అభివృద్ధి కానరాక అడవి మాదిరిగా అంతా తయారైంది. దాంతో జంగిల్ క్లియరెన్స్ కి అంతా సిద్ధం చేసింది. ఆ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. మరో వైపు చూస్తే కేంద్రంలో ఎన్డీయే కూటమి మూడవసారి అధికారంలోకి రావడంలో కీలకమైన పాత్ర పోషించిన టీడీపీ తన పలుకుబడిని ఈ విధంగా వాడుకుని అమరావతికి ప్రపంచ బ్యాంక్ నుంచి 15 వేల కోట్ల నిధులను మంజూరు చేయించుకుంది. మరో వైపు వివిధ ఏజెన్సీల ద్వారా ఇంకో 12 వేల కోట్ల రూపాయలను కూడా నిధులను సేకరిస్తోంది. దాదాపుగా ముప్పయి వేల కోట్ల రూపాయల నిధులతో అమరావతి రాజధానిని 2027 నాటికల్లా ఒక షేప్ కు తీసుకురావాలని టీడీపీ కూటమి తలపోస్తోంది. ఇవన్నీ ఇలా ఉంటే అమరావతి రాజధాని అని కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ అయితే ఇప్పటిరాకా రిలీజ్ చేయలేదు. దాని మీద విశాఖకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి ఒకరు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ఇక కూటమి ప్రభుత్వం కూడా ఈ విషయంలో అప్రమత్తంగానే ఉంది. అమరావతి ఏపీకి రాజధని అని గెజిట్ నోటిఫికేషన్ తెచ్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ కూడా ఉన్నందువల్ల బీజేపీ చెవిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయం వేశారు అని అంటున్నారు. దానికి కేంద్ర పెద్దలు కూడా సానుకూలంగా స్పందించారు అని అంటున్నారు. డిసెంబర్ నెలాఖరులోగా అమరావతి ఏపీకి రాజధాని అని కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ చేస్తుంది. అదే కనుక జరిగితే అమరావతికి అదే అతి పెద్ద రాజముద్ర గా ఉంటుంది అని అంటున్నారు. అమరావతి రాజధానిని ఇక మీద ఎవరు అధికారంలోకి వచ్చినా కదిపేందుకు వీలు ఉండదని అంటున్నారు. ఆ విధంగా గట్టి బిగింపులతోనే కూటమి ప్రభుత్వం అమరావతిని ఏపీకి శాశ్వత రజాధానిగా చేయబోతోంది. దాని వల్ల పెట్టుబడులు పెట్టే వారికి పరిశ్రమలు స్థాపించేవారికి కూడా పూర్తి స్థాయిలో నమ్మకం వస్తుందని అంటున్నారు. ఒక్క గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ అ నమ్మకం వస్తుందని అంటున్నారు. ఒక్క గెజిట్ నోటిఫికేషన్ రియితే చాలు అమరావతి అభివృద్ధి పరుగులు పెడుతుందని అంటున్నారు. మొత్తానికి వైసీపీ నినాదం అయిన మూడు రాజధానుల ముచ్చట చరిత్రలోనే కలసిపోతుంది అని అంటున్నారు అమరావతి ఏపీకి ఎప్పటికీ శాశ్వత రాజధానిగా ఉండబోతోంది అని అంటున్నారు. దాంతో ఎవరికీ ఏ డౌట్లొ లేకుండా కేంద్రం రాజముద్ర వేయనుంది అని అంటున్నారు.

## అందుకు వైఎస్ జగన్‌కి ఆస్కార్ ఇవ్వాలి.. దమ్ముంటే ఆయన సవాల్‌ను స్వీకరించాలి..

మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మరోసారి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. అబద్ధాలను అందంగా అల్లడంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌కి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని షర్మిల వ్యాఖ్యానించారు. శాలువాలు, సన్మానాలు, అవార్డులు కోరుకొనే ముందు జగన్ కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. "2021 మే నెలలో సెకీ వేసిన వేలంలో యూనిట్ ధర గరిష్టంగా రూ.2.14 పైసలు ఉంటే, తమరు రూ 2.49 పైసలకు కొన్నందుకు శాలువాలు కప్పాలా ? అదానీ వద్ద గుజరాత్ రాష్ట్రం యూనిట్ ధర రూ 1.99 పైసలకే కొంటే.. అదే కంపెనీ నుంచి 50 పైసలు ఎక్కువ పెట్టి, రూ.2.49 పైసలకు కొన్నందుకు మీకు సన్మానాలు చేయాలా? అదానీతో ఒప్పందానికి దేశంలో ఏ రాష్ట్రం ముందుకు రాకుంటే.. ఆగమేఘాల మీద ఒప్పందానికి మీరు ముందుకు వచ్చినందుకు మీకు అవార్డులు ఇవ్వాలా ? ట్రాన్స్మిషన్ ఛార్జీల భారం అక్కడ ఇక్కడ లేకుంటే గుజరాత్‌కి ఇచ్చిన రేటు ప్రకారం ఏపీకి రూ 1.99 పైసలకు అదానీ ఎందుకు ఇవ్వలేదు ? రూ.2.49 రేటుకు మీరెందుకు ఒప్పుకున్నారు ? ట్రాన్స్మిషన్ ఛార్జీలు గరిష్ఠంగా యూనిట్ రూ.1.70 పైసలు పడతాయని మీ హయాంలోనే ఇంధన శాఖ చెప్తుంటే ఎటువంటి ఛార్జీలు లేవని చెప్పే మీ మాటలు శుద్ధ అబద్ధం కాదా ? ఒక ముఖ్యమంత్రిని ఒక వ్యాపారవేత్త అధికారికంగా కలిస్తే గోప్యత పాటించడం దేశంలో ఎక్కడైనా ఉందా ? దమ్ముంటే జగన్ మోహన్ రెడ్డి గారు సమాధానం చెప్పాలి. నిజమే.. అదానీతో మీ ఒప్పందం రాష్ట్రంలోనే కాదు అంతర్జాతీయంగా చరిత్ర. అదానీ కలవడం ఒక చరిత్ర. రూ.1750 కోట్లు నేరుగా ముఖ్యమంత్రికి ముడుపులు ఇవ్వడం చరిత్ర. ఎవడు కొనేందుకు ముందుకు రాని విద్యుత్‌ను బంపర్ ఆఫర్‌గా ప్రకటించుకోవడం చరిత్ర. గంటల్లోనే క్యాబినెట్ పెట్టడం చరిత్ర. ప్రజా అభిప్రాయం లేకుండా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చరిత్ర. అదానీ కోసం అన్ని టెండర్లు రద్దు చేయడం చరిత్ర. ఒక వ్యక్తి స్వప్రయోజనాల కోసం ఏపీ రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.1.67 లక్షల కోట్ల భారాన్ని మోపడం చరిత్ర. ప్రపంచం మొత్తం ఇప్పుడు తమరి అవినీతి గురించి మాట్లాడుకోవడం మీ గొప్ప చరిత్ర. భూగోళం అవినీతి పరుల జాబితాలో మీపేరు చేరడం మీకు పెద్ద చరిత్ర. అమెరికా దర్యాప్తు సంస్థలు ఇచ్చిన రిపోర్ట్ లో నాపేరు ఎక్కడుందని బుకాయించే జగన్... ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్ అంటే ఆనాడు మీరు కారా.. ఆ కుర్చీలో మీరు కాకుండా మిమ్మల్ని నడిపించే వాళ్లు కూర్చున్నారా..? ఇదేం ఆఫ్ బేస్ట్ నాలెడ్జ్ ? ఇదేం అహంకారపు తిరస్కరణ సమాధానం..? మీరు అవినీతి చేశారని చెప్పింది మేము కాదు. అమెరికా అధికారిక దర్యాప్తు సంస్థలు ఎఫ్‌బీఐ, ఎస్ఈసీ స్వయంగా రిపోర్ట్ ఇచ్చాయి. సోలార్ పవర్ ఒప్పందాల్లో రూ.1750 కోట్లు ఏపీ చీఫ్ మినిస్టర్‌కి ఇచ్చారని తమ దర్యాప్తు లో కుండబద్దలు కొట్టాయి. ముడుపులు ముట్టాకే ఒప్పందాలు చేసుకున్నారని ఓ వంద పేజీల రిపోర్ట్ కూడా ఇచ్చాయి. వివిధ సోర్స్ ల నుంచి సాక్ష్యాలు, ఆధారాలు సమీకరించాం అని రిపోర్ట్ లో స్పష్టంగా పేర్కొన్నాయి.గత టీడీపీ ప్రభుత్వం ఎక్కువ ధరకు పీపీఎల్ చేసుకుందని, రూ.35వేల కోట్ల భారం వేసిందని చెప్పే మీరు..అధికారంలోకి వచ్చాక గాడిదలు కాశారా ? టెండర్లు రద్దుతో ఎందుకు సరిపెట్టారు ? ఎందుకు విచారణ జరిపించలేదు ? లాంగ్ స్టాండ్ ఒప్పందాలతో నష్టమని తెలిసి అదానీకి 25 ఏళ్లు రాష్ట్రానికి తాకట్టు పెట్టినప్పుడే మీకెంత ముట్టాయో అర్థమవుతోంది. గంగవరం పోర్టును అడ్డికి పావుసేరు లెక్కన రూ.640 కోట్లకే అమ్మినప్పుడే మీ ముడుపుల బంధం ఏపాటితో తెలిసిపోయింది. రాష్ట్రాన్ని బ్లాంక్ చెక్కులా అదానీకి కట్టబెట్టినప్పుడే మీ వాటాల సంగతి తేలిపోయింది. నిజంగా అదానీతో చేసుకున్న ఒప్పందంలో అవినీతి లేకుంటే, అదానీతో రహస్య ఒప్పందాలు జరగకుంటే, అమెరికా దర్యాప్తు సంస్థలు మీ మీద తప్పుడు ఆరోపణలు చేసి ఉంటే, మీరు అదానీ వల్ల ఆర్థికంగా లబ్ధి పొందలేదు అని బైబిల్ మీద ప్రమాణం చేయండి. దమ్ముంటే జగన్ మోహన్ రెడ్డి ఈ సవాల్‌ను స్వీకరించాలి" అని షర్మిల ట్వీట్ చేశారు.

## నిన్న 'ఇథనాల్'.. నేడు 'లగచర్ల'.. రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి



రద్దు చేయాలంటూ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో ప్రభుత్వం వారిని ఉపశమింపజేసేలా ఉన్నతాధికారులను పంపింది. అయితే, ఇప్పటికీ లగచర్ల భూములకు సంబంధించి రాజకీయ రగడ జరుగుతూనే ఉంది. రేవంత్ సమీప బంధువుల కోసమే ఈ ప్రాజెక్టును చేపట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. అది చల్లారక ముందే దిలావర్ పూర్ ఇష్యూ బయటకు వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కాస్త ఆత్మరక్షణలో పడింది. ఇథనాల్ పై మథనం దిలావర్ పూర్ లో ఇథనాల్ పరిశ్రమకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి తయారీకీ అనుమతులు వచ్చాయి. కేవలం ఇథనాల్ తయారీకే ఈ అనుమతులు. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇతర ఉత్పత్తులకూ ఓకే చెప్పింది. దీంతో మొత్తం ఉత్పత్తులను రద్దు చేయాలా? ఇతర ఉత్పత్తులను రద్దు చేయాలా? అనే సందిగ్ధం నెలకొంది. లగచర్ల రగడ తీరినట్లే.. ఫార్మా విలేజ్/ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్లలో భూసేకరణను లిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు లగచర్ల భూసేకరణ నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజల ఆలోచనలను, ప్రజా ఉద్యమాలను పరిగణనలోకి తీసుకుని ఈ చర్యలు చేపట్టింది. కాగా, లగచర్లలోని 580 మంది రైతులకు చెందిన 632 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్ ను ఆగస్టు 1న తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది. ఇథనాల్ పాపం బీఆర్ఎస్ దే లగచర్లలో భూ సేకరణ నోటిఫికేషన్ రద్దు చేస్తూనే.. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ లోని ఇథలాల్ కంపెనీకి సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టింది. బీఆర్ఎస్ హయాంలోనే దీనికి అనుమతులు మంజూరు చేశారంటూ ఆధారలను విడుదల చేసింది. బీఆర్ఎస్ సర్కారు ప్రజలను మోసం చేసిందని పేర్కొంది. పర్యావరణ శాఖ అనుమతులను ఉల్లంఘించి నిబంధనలను తుంగలో తొక్కారని తెలిపింది. కేంద్రం ఫ్యూయల్ ఇథనాల్ కు మాత్రమే అనుమతి ఇచ్చిందని.. వాటిని పట్టించుకోకుండా.. ఇథనాల్, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ స్పిరిట్స్, అబ్జల్యూట్ ఆల్కహాల్ ఉత్పత్తులకు అప్పటి మంత్రివర్గం అనుమతి జారీ చేసిందని వివరించింది. ఫ్యూయల్ ఇథనాల్ సాకుతో కంపెనీకి అనుకూలంగా పర్మిషన్లు ఇచ్చారని తెలిపింది. అయితే ఈ మేరకు మినహాయంపు కోసం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కంపెనీ అడ్డదారులు అనుసరించిందని ప్రభుత్వం మండిపడింది. కేంద్రం ఇచ్చిన పర్యావరణ అనుమతి ప్రకారం స్థానిక సంస్థలు ఎన్‌వోసీ తీసుకోవాలి. అదేమీ లేకుండా పీఎంకే డిస్టిలేషన్స్ గత ప్రభుత్వ అండతో కాంపౌండ్ వాల్ కట్టిందని.. 2022 అక్టోబర్ 22న 600 లక్షల లీటర్ల ఇథనాల్, ఇతర ఉత్పత్తుల కోసం ఎల్‌వోఐ జారీ అయిందని తెలిపింది.

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కేటీఆర్‌పై కొండా సురేఖ సంచలన ఆరోపణలు

: బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. గురుకులాల్లో కుట్రల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం ఉందని ఆమె ఆరోపించారు. గతంలో ఆయన గురుకులాల కార్యదర్శిగా పని చేశారని గుర్తు చేశారు. తన అనుచరులనే సిబ్బందిగా నియమించుకున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో గురుకులాల కుట్రల వెనుక ఆయన హస్తం ఉందన్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ... సంక్షేమ హాస్టళ్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. హాస్టళ్లలోని విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక హాస్టల్లో ఓ విద్యార్థిని చనిపోయిందన్నారు. బాధిత విద్యార్థినికి ప్రత్యేక వైద్య సదుపాయం అందించామన్నారు. దురదృష్టవశాత్తూ చనిపోయిందన్నారు. ఆమె మృతిపై రాజకీయం చేయవద్దని కోరారు. బీఆర్ఎస్ హయాంలో హాస్టళ్లలో భోజనంలో పురుగులు వచ్చేవన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాలు కొరవడినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. విద్యార్థిని మృతిని రాజకీయం చేయవద్దని కోరారు.

అందుకే కేటీఆర్ పదేపదే జైలుకు పోతా అంటున్నాడు

కేటీఆర్ ఏదో తప్పు చేసినట్లున్నాడని, అందుకే జైలుకు పోతానని పదేపదే అంటున్నాడని మంత్రి అన్నారు. గిరిజనుల కోసం జైలుకు పోతానంటున్నాడు... మూసీ నది కోసం జైలుకు పోతానని అంటున్నాడు... కానీ తాను చేసిన తప్పులకు జైలుకు పోతానని కేటీఆర్‌కు తెలుసు... అందుకే ప్రజల కోసం జైలుకు పోతానని అంటున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో తాను కూడా ఎమ్మెల్యేగా ఉన్నానని, కానీ కేసీఆర్ లేదా కేటీఆర్ ఎప్పుడైనా ఎమ్మెల్యేలను కలిసి సమస్యలు విన్నారా? అని ప్రశ్నించారు. కనీసం వారు మంత్రులకు కూడా దొరకలేదని విమర్శించారు. కానీ ఈరోజు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రజలు ఐదేళ్లు పాలించాలని అధికారం ఇస్తే ప్రభుత్వాన్ని దింపుతానని సైకోరావు అనడం విడ్డూరమని కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు.

## కాంగ్రెస్ కర్కషత్వం కారణంగా తెలంగాణ ప్రజల్లో నిప్పు పుట్టింది

మొదటి పేజి తరువాయి

అభిమానం ఉందని కేటీఆర్ తెలిపారు. దీక్షా దివస్ సందర్భంగా కరీంనగర్‌లోని అల్గునూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కరీంనగర్ వేదికగా రణగర్జనతో కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో ఆయన ఉద్యమాన్ని ప్రారంభించారు. ఉద్యమం నుంచి తప్పుకుంటే రాళ్లతో కొట్టండంటూ ఎంతో ధైర్యంగా కేసీఆర్ ప్రకటన చేశారు. ఇవాళ చాలామంది చాలా మాట్లాడుతూ కేసీఆర్‌ను తక్కువ చేయాలని ప్రయత్నించవచ్చు. కానీ కేసీఆర్ 2001లో తెలంగాణ కోసం పార్టీ పెట్టినప్పుడు రాజకీయంగా ఆయనకు 46 ఏళ్లు మాత్రమే. ఆయనకు నిజంగా పదవుల మీద మోజు ఉంటే అప్పటి ముఖ్యమంత్రి ఇచ్చిన మంత్రి పదవి ఆఫర్ ను తీసుకొని హాయిగా ఉండవచ్చు. తెలంగాణ నాయకులు పదవుల కోసం ఉద్యమాన్ని తాకట్టు పెడతారన్న అపవాదుకు వ్యతిరేకంగా ముందు తన పదవులకు రాజీనామా చేసి ఆయన పార్టీ ప్రారంభించారు. 14 ఏళ్లు ఎదురుదెబ్బలు, విజయాలు, అపజయాలు, ఆటుపోట్లు ఎన్నో ఎదుర్కొన్నారు అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ కర్కషత్వం కారణంగా తెలంగాణ ప్రజల్లో నిప్పు పుట్టింది. ఈ రోజు తెలంగాణ సాధన జరిగిందంటే అందుకు దాని మూడు కారణాలు. ఒకటి కేసీఆర్ నాయకత్వం, రెండు అమరుల ప్రాణత్యాగం, మూడోది కాంగ్రెస్ కర్కషత్వం. కేసీఆర్ చేసిన ఆమరణ దీక్ష కారణంగా రాష్ట్రం ఇవ్వకపోతే వీపు చింతపండు అవుతదనే పరిస్థితి వచ్చింది. విధి లేని పరిస్థితుల్లోనే కాంగ్రెస్ తెలంగాణను ఇచ్చింది. తెలంగాణ ఉద్యమంలో మన మీద తుపాకీ పట్టినోడు ఇప్పుడు ఏదేదో వాగుతున్నాడు. ఎన్నో అబద్ధపు హామీలు, ఆరు గ్యారంటీలు, నంగనాచి మాటలు చెప్పి కాంగ్రెస్ వాళ్లు అధికారంలోకి వచ్చారు. తెలంగాణలో ఏ వర్గాన్ని నీ పాలన గురించి అడిగినా సరే బోరున ఏడుస్తున్నారు. గురుకులాలల్లో విద్యార్థులకు కనీసం సరైన భోజనం పెట్టలేక వాళ్లు చనిపోతున్న పరిస్థితి. ఈ పాటి పాలనకు విజయోత్సవాలంట. పోలీసులు లేకుండా ప్రజల్లోకి పోతే ఉరికించి కొట్టే పరిస్థితి ఉందని కేటీఆర్ తెలిపారు. ఇప్పుడంటే బీఆర్ఎస్‌కు ఎంతోమంది నాయకులు, పెద్ద బలగం ఉంది. కానీ 2001లో కేసీఆర్ తెలంగాణ ఉద్యమం మొదలు పెట్టిన నాడు ఎవరూ లేరు. ఆ నాడు మనీ, మజిల్, మీడియా, క్యాస్ట్ ఇలా ఏ పవర్ లేదు. తెలంగాణ వస్తదా అని అందరికీ అనుమానాలు ఉండె. అనుమానాల నీలి నీడల మధ్య ఆగమ్య గోచరంగా ఉన్న పరిస్థితుల్లో కేసీఆర్ ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారని కేటీఆర్ తెలిపారు.

## కాకినాడ పోర్టు నుంచి అక్రమ రవాణాపై ప్రధాని మోదీకి లేఖ సిద్ధం చేయండి

మొదటి పేజి తరువాయి



కాకినాడ పోర్టు అక్రమ రవాణా చాలా తీవ్రమైన అంశం అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కాకినాడ పోర్టు నుంచి జరుగుతున్న అక్రమ రవాణా కార్యకలాపాలపై ప్రధాని మోదీకి, రాష్ట్ర హోంమంత్రి అనితకు, దర్యాప్తు సంస్థలకు లేఖలు సిద్ధం చేయాలని తన వ్యక్తిగత కార్యదర్శిని ఆదేశించారు. ఇక్కడ ఎన్నో జాతీయ సంస్థలు, పెద్ద కంపెనీలు ఉన్నాయని... అక్రమ రవాణా మార్గాల్లో ప్రమాదకర శక్తులు వస్తే ఆయా సంస్థలు, కంపెనీల రక్షణకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది తీవ్రంగా పరిగణించాల్సిన అంశం అని, తీర ప్రాంతంలో అక్రమ రవాణా విషయంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందితే అది దేశ భద్రతకే భంగం కలిగిస్తుందని వివరించారు. అక్రమ రవాణా చేస్తున్న బోటు ఓనర్లు, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులు, దీని వెనకున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని, ఈ మొత్తం వ్యవహారం వెనకున్న కింగ్ పిన్ లను గుర్తించాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. "పోర్టు నుంచి బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నప్పుడు, భవిష్యత్తులో పేలుడు పదార్థాలు అక్రమ రవాణా జరగవని గ్యారంటీ ఏంటి? ఈ అక్రమ మార్గాల్లో కసబ్ వంటి ఉగ్రవాదులు వచ్చే ప్రమాదం ఉండదా? దీనిపై జిల్లా ఎస్పీ వెంటనే స్పందించాలి" అని పవన్ పేర్కొన్నారు.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

శనివారం - 30 - నవంబర్ - 2024

## విజిలెన్స్మెంబర్ లకావత్ వెంకటేశ్వర్లు సన్మానించిన జిమ్ కోచ్ జీవి రాంరెడ్డి, నేషనల్ లిఫ్టర్ కృష్ణాజి.



ఎట్ట పాక /నవంబర్ 29(జనం రిపోర్టర్): భద్రాచలంలోని అభయాంజనేయ స్వామి పార్కులో జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ గా ఎంపికైన లకావత్ వెంకటేశ్వర్లను లైన్స్ క్లబ్, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల వాళ్లు, పూలదండలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జి విరామిరెడ్డి, నేషనల్ పవర్ లిఫ్టర్ మహంతి వెంకటకృష్ణాజి, ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు ని కలిసి, పూలదండ వేసి, శాలువాతో, ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిమ్ కోచ్ జీవి రామిరెడ్డి మాట్లాడుతూ లకావత్ వెంకటేశ్వర్లు గత ప్రభుత్వంలో ఆత్మ కమిటీలో, దిశా కమిటీలో, సభ్యులుగా ఎన్నికవ్వడం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా జిల్లా విజిలెన్స్ సభ్యునిగా, ఎంపికవటం పట్ల భద్రాచలం వాసులకు వెంకటేశ్వర్లు అందరికీ సుపరిచితుడే కావున అన్ని సామాజిక వర్గాల వారు కూడాహర్షం వ్యక్తం చేస్తున్నారు అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు, రోటరీ క్లబ్ సభ్యులు, రెడ్ క్రాస్ సొసైటీ వివిధ స్వచ్ఛంద సంస్థల , పట్టణ ప్రముఖులు, ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## తెదేపా కార్యకర్తకు 20వేల రూపాయలు ఆర్థిక సహాయం



నార్పల /నవంబర్ 29(జనం రిపోర్టర్): అందించిన తెదేపా నాయకులు బొందలవాడ ,శివకృష్ణ చౌదరి, చరవాణి ద్వారా పరామర్శించి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా.. తెలుగుదేశంపార్టీ సీనియర్ కార్యకర్త గొల్లపల్లి పోతులయ్య గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న విషయం తెలుసుకున్న తెలుగుదేశంపార్టీ నాయకులు బొందలవాడ శివకృష్ణచౌదరి తక్షణమే వారి ట్రస్ట్ బృందాన్ని ఆసుపత్రికి పంపించి ఫోన్ ద్వారా మాట్లాడి ధైర్యంగా ఉండమని భరోసా కల్పించారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాధితునికి తక్షణ సహాయంగా 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించి మెరుగైన వైద్యం అందించేలా వైద్యులతో మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో బండ్లపల్లి శేషానందరెడ్డి, సిద్దరాచెర్ల నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.



### హెడ్ కానిస్టేబుల్ నుండి ఎఎస్ఐ గా

## పదోన్నతి పొందిన తిమ్మరాజులు

నార్పల /నవంబర్ 29(జనం రిపోర్టర్): శింగనమల మండలంలోని పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న తిమ్మరాజులు ఎఎస్ఐ గా పదోన్నతి పొందారు.పదోన్నతి పొందిన తిమ్మరాజులుకు శింగనమల సీఐ కౌలుట్లయ్య,ఎస్సై శరత్ చంద్ర, తోటి సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## పోలీస్ అధికార్ల అండతో డూప్లికేట్ కాగితాలు సృష్టించి పట్టాదార్లనుభయభ్రాంతులకు గురిచేస్తున్నా జగ్గురాంనాయక్ పై కేసునమోదు చెయ్యాలి



ఏటూరునాగారం /నవంబర్ 29(జనం రిపోర్టర్): ఏటూరునాగారం మండల కేంద్రం లో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత మాట్లాడుతూ ఏటూరునాగారం గ్రామపంచాయతీ పరిధిలో గల రెడ్డి లక్ష్మయ్య సర్వే నెంబర్ 247/7 సర్వేగాల భూమినీ ఆక్రమించుకోవడం కోసం జి సి సి మాజీ సేల్స్ మెన్ దారంసొత్ జగ్గురాంనాయక్ గాఉద్యోగం చేస్తూనే అక్రమ సంపాదన కోసం సస్పెండ్ ప్రభుత్వ చేసినప్పటికి మాజీ సేల్స్ మెన్ జగ్గురాం నాయక్ తీరు మారక పోవడం బాధాకరం అన్నారు అదేవిదంగా అక్రమ సంపాదన కోసం భార్య పేరు కూడా అమాయకులైన నాయకపు కులం కు చెందిన రెడ్డి లక్ష్మయ్య దగ్గర భూమి కొన్నాట్టు డూప్లికేట్ కాగితాలు సృష్టించి పోలీస్ అధికార్ల అండతో పట్టాదార్లకు భూమి కి సంబంధం లేదు అంటూ పోలీస్ స్టేషన్ నుండి రెడ్డి లక్ష్మయ్య కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురించేస్తున్నా దారంసొత్ జగ్గురాం నాయక్ రఘురామ్ నాయక్ పైన చట్ట రీత్యా కేసులు నమోదు చేస్తూనే రెడ్డి లక్ష్మయ్య కుటుంబ సభ్యులను బెదిరించి పోలీస్ స్టేషన్ నుండి ఫోన్ చేపిస్తున్నా పెండ్యాల ప్రభాకర్ ఏళ్ల ప్రగాఢ సూర్య నారాయణ బానుప్రకాష్ పైన న్యాయ విచారణ చేసి ఎస్ సి ఎస్ టి కేసు నమోదు చెయ్యాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి డా జాడి రామరాజు నేత అన్నారు అదేవిదంగా రెడ్డి లక్ష్మయ్య కుమార్లు ముత్తయ్య పుల్లయ్య కలెక్టర్ ను సంప్రదించిన భాదితులకు న్యాయం చెయ్యండి అని ఆర్ డి వో స్థానిక తహసీల్దార్ కు చెప్పగాఇంక్యూవేర్ చెయ్యక ముందుగానే ఏటూరునాగారం సి ఐ ఆఫీస్ నుండి ఫోన్ చేపించి పట్టాదార్ల కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురించేస్తున్నా జగ్గురాం నాయక్ రఘురామ్ నాయక్ అనసూర్య పైన చట్ట రీత్యా చర్యతీసుకొని పట్టా దార్లకు న్యాయం చెయ్యాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత అన్నారు

## ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రచారం




రేపల్లె నవంబర్ 29 జనం రిపోర్టర్: ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు తమదైన శైలిలో ప్రచారం నిర్వహించాలని శ్రీ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవిచంద్ర తెలిపారు. కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కలిగించేలా చిత్రలేఖను పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో కమిషనరేట్ అఫ్ కాలేజీయేట్ ఆదేశాల మేరకు ప్రపంచ ఎయిడ్స్ డే వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబరు1వ తేదీని ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంగా జరుపుకుంటారని గుర్తు చేశారు. ఈ మేరకు ప్రజలకు ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించడం, ఎయిడ్స్ రోగులకు మద్దతు ఇవ్వడం, ఎయిడ్స్ ప్రతిరోధానికి ప్రపంచ సమాజాన్ని ఒకచోట చేర్చడం అని తెలిపారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కో -ఆర్డినేటర్ డాక్టర్ బుజ్జి బాబు మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ప్రతి సంవత్సరం ఒక కొత్త స్లొగన్ ఎంపిక చేయబడుతుందని చెప్పారు. ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు తమ వంతు సహాయ సహకారాలు అందించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం చిత్రాలేఖన పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, బాల గురవయ్య పాల్గొన్నారు.

## వన సమారాధన లో పాల్గొన్న ఎమ్మెస్వోలు

వన సమారాధనలతో ఐక్యమత్యం



రేపల్లె నవంబర్ 29 జనం రిపోర్టర్: కార్తీక వన సమారాధనతో ఆధ్యాత్మిక చింతన, మానసిక ఉల్లాసం, సోదర భావం, సామాజిక ఐక్యమత్యం పెంపొందుతుందని ఏస్ ఏస్ సి న్యూస్ ఛానల్ అధినేత సుఖవాసీ సతీష్ బాబు అన్నారు. నగరం మండలం ఏలేటిపాలెం గార్డెన్స్ లో శుక్రవారం పాత రేపల్లె నియోజకవర్గం లోని నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లె మండలాల ఏం ఏస్ ఓ లు, న్యూస్ ఛానల్ సిబ్బందితో వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఉసిరి చెట్టుకి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్తీక వన సమారాధన ఏర్పాటు చేసుకోవడం వల్ల సిబ్బంది మధ్య ఐకమత్యం పెరుగుతుందన్నారు. ఒకరికొకరు ఆత్మీయత, అనురాగాలతో కలసి మెలసి జీవించడానికి వన సమారాధనలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన విందు భోజనాలు ఆరగించారు.

## సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా

రేపల్లె, నవంబర్ 29 జనం రిపోర్టర్: తెలుగుదేశం సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుందని టిడిపి నాయకులు వీరవల్లి శివరామకృష్ణ అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో భీమా సౌకర్యం ఉందన్నారు. రూ.200 తో సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదంలో కార్యకర్త మరణించినట్లయితే ఆ కుటుంబానికి రూ 5 లక్షల బీమా అందజేయడం జరుగుతుందన్నారు. సాధారణ మరణం సంభవించినట్లయితే మట్టి ఖర్చుల నిమిత్తం రూ .10,000 ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఇప్పటికే 70 లక్షల మంది సభ్యత్వం నమోదు చేసుకున్నారని చెప్పారు. ప్రతి కార్యకర్త చెల్లించిన సభ్యత్వ రుసుం మొత్తం తిరిగి కార్యకర్తలకు లబ్ది చేకూరే విధంగా యువనేత, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సరికొత్తగా ఆలోచించి భీమ పథకాన్ని ప్రవేశ పెట్టారని అన్నారు. చనిపోయిన కార్య కర్తలకు గతంలో ఇచ్చిన రూ 2లక్షల పరిహారం ప్రస్తుతం 5 లక్షలు చేశారని చెప్పారు. 2024-26 సభ్యత్వ నమోదు డిసెంబర్ 2వ తేదీతో ముగుస్తుందన్నారు. నియోజక వర్గం లోని టిడిపి కుటుంబ సభ్యులందరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులందరూ కలిసి సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగ వంతం చేయాలని కోరారు.

## పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

రేపల్లె నవంబర్ 29 జనం రిపోర్టర్: సమాజంలోని పౌరులందరూ తమ హక్కుల పై అవగాహన కలిగి ఉండాలని మండల తహసిల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెనుమూడి గ్రామ శివారు రావి అనంతవరంలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు రాజ్యాంగం ద్వారా తమకు సంక్రమించిన హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, నిమ్న జాతుల వారిని కించపరిచే ఈ విధంగా ప్రవర్తించడం చట్టప్రకారం నేరమన్నారు. రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎక్కడైనా పౌరహక్కులకు భంగం వాటిల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివక్ష లేకుండా ప్రజలందరూ కలిసిమెలిసి జీవించాలని ప్రతి పౌరుడూ సమానత్వంతో మెలగాలన్నారు. కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు స్నేహభావంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో రెవిన్యూ04 ఇన్స్పెక్టర్ రాంబాబు వీఆర్వోలు సర్పంచ్ దారం విజయ్ఇ ఒ పి ఆర్ డి,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గోలివాడ గ్రామం ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో ఐకెపి వద్ల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే రాసి ఠాగూర్....



రామగుండం /నవంబర్ 29(జనం రిపోర్టర్): అంతర్గాం మండలం గోలివాడ గ్రామం ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో ఐకెపి వద్ల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే ఠాగూర్. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ... వడ్లు కటింగ్ లేకుండా కొనుగోలు చేస్తున్నాం ,,సన్నడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నాం అని తెపిపారు రైతుల కళ్ళలో ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ అన్నారు. రైతులు భరోసాగా ఉంటున్నాం, దళారుల చేతిలో మోసపోవద్దని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, వాటిని రైతుకు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, ప్రతి గింజ సన్న వడ్లకు బోనస్ రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని హామీ ఇచ్చారు.



నిబంధనలు మేరకు ధాన్యంలో తేమ శాతం ఉండేలా రైతులు ధాన్యాన్ని ఆరబోయాలని సూచించారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యం ఉంటే వేరువేరుగా ఉంచాలని మిల్లర్లతో మాట్లాడి సవరేటుగా మద్దతు ధరకు కొనుగోలు చేయించే భాధ్యత నాదేనని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రానున్న యాసంగి సాగుకు అనురాధ కార్తెలో నార్లు పోయాలని, తద్వారా అనుకూల వాతావరణంలో పంట చేతికి వస్తుందని అన్నారు. యాసంగిలో తెగుళ్లను తట్టుకునే వరి రకాలను సాగు చేసుకోవాలని రైతులకు వివరించారు. 1010, 64, 118 రకాల యాసంగికి అనుకూలమన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజా పాలనలో రైతులకు మేలు చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సమాఖ్య సంఘం నిర్వహులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసిలు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ బరోసపై గ్రామాలలో టాం టామ్ వేయించాలి



రేపల్లె నవంబర్ 29 జనం రిపోర్టర్: నిజాంపట్నం మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, మరియు ఐ ఒ పి ఆర్ అండ్ ఆర్ డి, మండలంలో ఉన్న అన్ని పంచాయతీల వెల్ఫేర్ అసిస్టెంట్ అసిస్టెంట్లకు, పంచాయ దుతీ కార్యదర్శులకు, డిసెంబర్ నెల కు సంబంధించిన ఎన్టీఆర్ పెన్షన్ భరోసా కార్యక్రమ గురించి రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగినది. ఎంపిడిఒ నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న లబ్దిదారులకు టామ్ టామ్ ద్వారా సమాచారం అందించాలని అవుట్ ఆఫ్ స్టేషన్ వున్న వారికి చరవాణి ద్వారా సమాచారం ఇచ్చి పిలిపించాలని, పెన్షన్లు పంచె ప్రతి ఒక్క సిబ్బంది ఉదయం 5 : 30 నిమిషాలకు లాగిన్ అయి పెన్షన్లు పంపిణీ చేయాలని ఆదేశించడం అయినది. నూరు శాతం పంపిణీ కార్యక్రమం పూర్తయ్యాల పని చేయాలని ఆమె తెలియజేశారు.

### సోషల్ మీడియాలో ప్రతిపక్షాలు చేస్తున్న

## అసత్య ఆరోపణలను తిప్పి కొట్టండి



అమరచింత వనపర్తి నవంబర్ 29 జనం రిపోర్టర్: సోషల్ మీడియా సాక్షిగా హరీష్ రావు కేటీఆర్ లు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కల్లుగీత డిపార్ట్మెంట్ చైర్మన్ కేశంనాగరాజు గౌడ్ కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నేడు మహబూబ్ నగర్ లో జరుగు జిల్లా రైతు సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో ఆయన పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కొద్ది సమయంలోనే ఇచ్చిన 6 గ్యారంటీలో నాలుగు అమలు చేసి చూపించామని అన్నారు. ఈ విషయాన్ని కార్యకర్తలు తమ తమ గ్రామాలలో బలంగా వినిపించేలా కృషి చేయాలని. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేసామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ,2320 రూపాయల మద్దతు ధరతో పాటు బోనస్ 500 రూపాయలు చెల్లిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కష్టపడుతుంటే కార్యకర్తలు మాత్రం అభివృద్ధిని గ్రామాల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారని ఆయన ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కార్యకర్తలు ప్రజలకు చేరవేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో నోటిఫికేషన్ లో తప్ప ఉద్యోగ భర్తీ లేదన్నారు గ్రూప్ 1,3,4 పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించి ఇప్పటికే 50 వేల మందికి నియామక పత్రాలు ఇచ్చామన్నారు. డిసెంబర్ లో గ్రూప్2 పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు.దేశంలోనే రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కిందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ అనతి కాలంలోనే రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి గాడిలో పెట్టారని ఇది కాదా అభివృద్ధి అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు? బూర్గుల రామకృష్ణారావు తర్వాత మన జిల్లా నుండి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని ఆరోపించారు. గతంలో జరిగిన లక్షల కోట్ల అవినీతిని బయటకు తీస్తామని , కేటీఆర్ హరీష్ రావులకు భయపట్టుకున్నదని అన్నారు.



ఉమ్మడి అమరచింత, ఆత్మకూరు మండలాల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కృషితోనే అమరచింత మండలంలో జూనియర్ కాలేజీ ధర్మపూర్ రోడ్డు నిర్మాణానికి రెండు కోట్లు నందిమల్ల టు చంద్రఘఢ్ గేట్ వరకు ఒక కోటి 40 లక్షల రూపాయలు ఎమ్మెల్యే మంజూరు అయ్యాయని గుర్తు చేశారు. రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అవకాశాలు ఇస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాలకు చేరవేసి ప్రజల మన్ననను పొందిన వారే ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తారని అటువంటి వారికి తప్పకుండా అవకాశం వస్తుందన్నారు. నేడు పాలమూరు జిల్లాలో జరిగే రైతు సంబరాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్నారని ఉమ్మడి మండలాల నుండి రైతులు వ్యవసాయ కూలీలు కార్యకర్తలు ఆయా గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు సీనియర్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయుబ్ ఖాన్ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ మాజీ ఎంపిటిసి తిరుమలేష్ పోసిరి గారి విష్ణు హనుమంతు నాయక్ ప్రకాశం మణి వర్ధన్ రెడ్డి రఫీ కారిడీ లక్ష్మీకాంత్ రెడ్డి దాసు ఆయా గ్రామాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## తాగు బోతులకు అడ్డాగా మారిన ప్రభుత్వ పాఠశాలలు





అమరచింత వనపర్తి నవంబర్ 29 జనం రిపోర్టర్: వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో తాగుబోతులు రాత్రి వేళల్లో రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో తిష్ట వేసి మద్యం సేవించి కాళీ బాటిల్లను వాటర్ ప్యాకెట్లను వదిలేసి వెళ్తున్నారు. విద్యను అందించే విద్యాలయాల్లో ఇలాంటి పాడు పనులు చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో తాగుబోతులు మరింత రెచ్చిపోతున్నారు. రాత్రివేళ మద్యం సేవించి తిరుగుతున్న మందుబాబులను అటు పోలీసులు నియంత్రించలేక పోతున్నారని ఆరోపణలు వస్తున్నా. రాత్రి వేళలో పోలీసులు గస్తి మరింత పెంచాలని పట్టణ ప్రజల డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు పోలీసులు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పద్మశాలియ వనసమారదన




రేపల్లె నవంబర్ 28 జనం రిపోర్టర్ : రేపల్లె పట్టణం ఓల్డ్ టౌన్ లోని జమీందారు కోట యందు పద్మశాలి ఎంప్లాయిస్ మరయు ప్రొఫషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పద్మశాలి కార్తీక వన సమారాజన జరిగినది. ఈ సమారాజనకు డాక్టర్ ఎ వి.సుబ్బారావు ముఖ్యఅతిదిగా విచేసినారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జాతి మొత్తం గర్వపడేలా ఐక్య మత్యం తో ఉండాలన్నారు ,కలిసి ఉంటే ఎంతో మేలు జరుగు తుందన్నారు పోలిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇంక నారాయణ%శీ% రామమోహన రావు, జివి.నాగేశ్వరావు, పట్టెం శ్రీనివాసరావు, జొన్నాదులశ్రీ నాగరాజు, మునగాల నాగేశ్వరావు, ఆకురాతి రామచంద్ర రావు, కౌతరపు నాంచారరావు, యంగళ సంజీవయ్య, పోలిశెట్టి సంబశివరావు తది తరులు పాల్గొన్నారు

## అమరచింతలో బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్



అమరచింత వనపర్తి నవంబర్ 29 జనం రిపోర్టర్: ప్రభుత్వ పాఠశాలలు గురుకుల పాఠశాలలో ఇటీవల జరుగుతున్న పాడుపు పాయిజన్ ఆత్మహత్యల నేపథ్యంలో బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నాయకులు సాంఘిక సంక్షేమ భవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అమరచింతలో పలువురు బీజేవైఎం నాయకులు పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీజేవైఎం నాయకులు అన్నారు. అరెస్టును నిరసిస్తూ పోలీస్ స్టేషన్ లో నే నిరసన తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో పిజీవోఎం నాయకులు హరికృష్ణ ప్రశాంత్ చాకలి రవి భాగ్యరాజ్ సందీప్ ఉన్నారు.

## ముర్మర్ కస్తూరి భా హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్....

### విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు...



రామగుండం /నవంబర్ 29(జనం రిపోర్టర్): అంతర్గాం ఇటీవల తెలంగాణ రాష్ట్రం లో కొంత మంది కుట్రదారుల వలన జరుగుతున్న ఘటనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు రామగుండం నియోజకవర్గంలో ఉన్న వివిధ హాస్టళ్లలో జరగకుండా, ముందుస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులను కన్నబిడ్డల్లా చూడాలని, పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించాలని ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ కస్తూరి భా విభాగాధిపతి కి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల కోసం అనేక సానుకూల నిర్ణయాలను తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే తెలియజేయడం జరిగింది. రాష్ట్రంలో కొన్ని గురుకులాల్లో వరుస ఘటనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారిపై చర్యలు చేపట్టింది. గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లు, అంగన్?వాడీలు, ఆసుపత్రుల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై ఫుడ్సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసింది. ఫుడ్ సేఫ్టీ కమిషనర్, ఘటన జరిగిన శాఖ అధిపతి లేదా అదనపు డైరెక్టర్, ఆ శాఖ జిల్లా అధికారులను టాస్క్?ఫోర్స్?లో సభ్యులుగా నియమించింది. ఆహారం కల్తీ జరిగినప్పుడు తనిఖీ చేసి, కారణాలతో పాటు బాధ్యులను గుర్తించి, ఈ కమిటీ నివేదిక ఇవ్వాలని సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతీ విద్యా సంస్థలో హెడ్ మాస్టర్, ఇద్దరు సిబ్బందితో ఫుడ్?సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎస్, కు ఆదేశించారు. ఈ కమిటీ వంటగదిలో పరిశుభ్రత పరిశీలించిన తర్వాతే వంట చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వంట



పూర్తయ్యాక ఫుడ్ సేఫ్టీ అధికారులు తిని పరిశీలించిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలని స్పష్టం చేసింది. మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులను పర్యవేక్షకులుగా నియమించాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. పర్యవేక్షకులు కూడా పిల్లలకు భోజనం పెట్టే ముందు, వంటగదిని తనిఖీ చేసి, భోజనం రుచి చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ కార్యక్రమంలో అంతర్గాం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### గురుకుల పాఠశాలలో జరిగిన ఘటనల నిరసిస్తూ

## నేడు రాష్ట్ర వ్యాప్త విద్యాలయాల బంద్

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కే రాఘవ



అమరచింత వనపర్తి నవంబర్ 29 జనం రిపోర్టర్: గురుకుల ప్రభుత్వ పాఠశాలలో వరుసగా జరుగుతున్న ఘటనలను నిరసిస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ పిలుపుమేరకు విద్యాలయాల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా అధ్యక్షులు కే రాఘవ తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఈ గడ్డలు జరుగుతున్నావని ఆయన ఆరోపించారు. మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో వరుసగా కలుషిత ఆహారం మదనాపురం గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి విద్యార్థి ఆత్మహత్య ఇలాంటి ఘటన జరుగుతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదని ఆరోపించారు. ఈ ఘటనలో నివసిస్తూ చేపట్టిన విద్యాలయాల బందుకు ప్రతి ఒక్కరు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.థ

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక
శనివారం - 30 - నవంబర్ - 2024

# పద్మశాలియ వనసమారదన

రేపల్లె నవంబర్ 29 జనం రిపోర్టర్: రేపల్లె పట్టణం ఓల్డ్ టౌన్ లోని జమీందారు కోట యందు పద్మశాలి ఎంప్లాయీస్ మరయు ప్రోపషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పద్మశాలి కార్తీక వన సమారాజన జరిగినది. ఈ సమారాజనకు డాక్టర్ ఎ వి.సుబ్బారావు ముఖ్యఅతిదిగా విచేసినారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జాతి మొత్తం గర్వపడేలా ఐక్య మత్యం తో ఉండాలన్నారు ,కలసి ఉంటే ఎంతో మేలు జరుగు తుందన్నారు పోలిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇంక నారాయణ రామమోహన రావు, జివి.నాగేశ్వరావు, పట్టెం శ్రీనివాసరావు, జొన్నాదులశ్రీ నాగరాజు, మునగాల నాగేశ్వరావు, ఆకురాతి రామచంద్ర రావు, కౌతరపు నాంచారరావు, యంగళ సంజీవయ్య, పోలిశెట్టి సంబశివరావు తది తరులు పాల్గొన్నారు

# ప్రత్యేక అలంరణలతో చెన్న మలేశ్వరమ్మ



రేపల్లె /నవంబర్ 29(జనం రిపోర్టర్): బాపట్ల జిల్లా రేపల్లె పట్టణం ఇసుకపల్లి గ్రామములో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వర స్వామి వారి దేవస్థానము నందు శుక్రవారం స్వాతీ నక్షత్రం, కార్తీక మాస మాస శివరాత్రి సందర్భంగా ప్రాతఃకాలమున స్వామివారి కి రుద్రాభిషేకము తదనంతరము అమ్మ వారికి శ్రీ సూక్త విధాన కుంకుమార్చన తదనంతరము మహిళా మ తల్లులచే సుమంగళి పూజా కార్యక్రమము జరిగినది ఈ కార్యక్రమం నందు రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు



అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ గ్రామ పెద్దలు పాలకేంద్రం అధ్యక్షులు ముత్త వరపు స్వాతంత్ర తేజ్ కుమార్ వారు పాల్గొనినారు 210 మంది మహిళామ తల్లులు చే ఈ సుమంగళి పూజ జరిగినది తదనంతరము భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదములు సుమంగళి పూజా కార్యక్రమములో పాల్గొనిన భక్తులందరికీ అమ్మవారి దివ్య లడ్డు ప్రసాదము క్షీరాణము రక్షాబంధనములు ఇవ్వబడిన తదనంతరము పండిత ఆశీర్వచనము జరిగినది ఈ పూజా కార్యక్రమములు సదరు దేవాలయము కార్యనిర్వాహణాధికారి అయిన దీవి వెంకట అప్పలాచార్యులు గారి పర్యవేక్షణలో అనువంశిక అర్చక స్వామి పవన్ కుమార్ శర్మ , పండిత పని కుమార్ శర్మ మరియు వాసు శర్మ రామకృష్ణ ప్రసాద్ శర్మ మారుతీ శర్మ గారలచే కార్యక్రమములు జరిగినవి భక్త మహాశయులు ఆనందోత్సాహములు తో పారవశ్యులైనారు. అమ్మవారి అయ్యవారి అలంకారమునకు భక్తులు మంత్రముగ్ధులైనారు...

# నాటి త్యాగ ఫలితమే నేటి తెలంగాణ



అమరచింత వనపర్తి నవంబర్ 29 జనం రిపోర్టర్: అమరచింత పట్టణంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ కలాం పాష దీక్ష దివస్ 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం అమరచింతలు సంబరాలు నిర్వహించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు కలంపాష మాట్లాడుతూ నాటి త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ 29 నవంబర్ 2009 రోజు తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షులు కెసిఆర్ దీక్ష దివస్ పిలుపునివ్వడంతో తెలంగాణ తెచ్చుడో కెసిఆర్ సచ్చుడో అనే నినాదంతో యావత్ తెలంగాణ కెసిఆర్ దీక్షకు మద్దతుగా ఊరు వాడ వాడ జై తెలంగాణ నినాదంతో తెలంగాణ యువత ఏకం చేస్తూ కేసీఆర్ దీక్షకు మద్దతుగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మహబూబ్ నగర్ నియోజకవర్గం మక్తల్ నియోజవర్గం జడ్చర్ల నియోజకవర్గం దేవరకద్ర నియోజకవర్గం లో ప్రతి ఊరు ప్రతి వాడలో జై తెలంగాణ జై జై తెలంగాణ, వీడెవ్వడు వాడేవ్వడు తెలంగాణ కడ్డేవడు, నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ గోడలపై వాల్ ఫైటింగ్ గోడ రాతలు రాయు స్తూ గ్రామాలలో యువతను చైతన్య పరుస్తూ ప్రతి ఒక్కరు తెలంగాణ లక్ష్యంగా ముందుకు సాగిన దినంగా చెప్పుకోవచ్చు అని ఆయన సయ్యద్ కలాం పాషా అన్నారు.

# నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం.



పొన్నూరు నవంబర్ 29. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు ఆర్టీసీ డిపో నందు శనివారం డయిల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమము ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ టి.అజిత కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.00 నుండి 11.00 గంటల వరకు ఆర్టీసీ డిపో అభివృద్ధి కు సంభందించిన విషయాలపై మీ యొక్క అమూల్యమైన సూచనలు,సలహాలు ఇవ్వవలసినదిగా కోరారు. మీ యొక్క అమూల్యమైన సలహాలను డిపో మేనేజర్ టి. అజిత కుమారి కు 9959225267 ఫోన్ ద్వారా తెలియజేయాలని ఆమె పేర్కొన్నారు.

# కెసిఆర్ దీక్షతోనే తెలంగాణ సాధించుకుంనం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్ )నవంబర్ 29/: కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాధ్యమైందని మాజీ ఎమ్మెల్సీ, దీక్షా దివస్ జిల్లా ఇన్చార్జి ఫారూక్ హుస్సేన్ అన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ లో ఆయన మాట్లాడారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ అన్ని పార్టీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లారన్నారు. చాలామంది అమ్ముడుపోతారంటూ ఆరోపణలు చేశారని, కానీ కేసీఆర్ అమ్ముడుపోయే మనిషి కాదన్నారు.

బీఆర్ఎస్ ను ఖతం చేయడం ఎవరి తరం కాదు

ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రతిసారి బీఆర్ఎస్ పార్టీ ఖతం అవుతుందంటూ మాట్లాడుతున్నాడని, తమ పార్టీని ఖతం చేయడం ఎవరి వల్ల కాదన్నారు. రాష్ట్రంలో ఏ సీఎం పడని తిట్లు రేవంత్ రెడ్డి పడుతున్నారన్నారు. దీక్షా దివస్ ను దృష్టిలో పెట్టుకొని కావాలని జిల్లాలో మంత్రుల పర్యటన చేపట్టారని పేర్కొన్నారు. 2027 లో కచ్చితంగా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్ బీగాల గణేష్ గుప్తా మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు, పార్టీ బోధన్ ఇన్చార్జి అయేషా ఫాతిమా, ఎస్ఏ అలీం, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో లెక్చరర్ మృతి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్ )నవంబర్ 29/: కోటగిరి: గుండెపోటుతో లెక్చరర్ మృతి చెందిన ఘటన కోటగిరి మండలంలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరి జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్ గా విధులు నిర్వహిస్తున్న గోవర్ధనగిరి (49) విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో స్థానిక సిబ్బంది హుటాహుటిగా ఆస్పత్రి కి తరలించారు. కానీ మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

# సిఎం ప్రోగ్రాం సందర్బంగా ముందస్తు చర్యలు...

-పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్....



రామగుండం/నవంబర్ 29(జనం రిపోర్టర్): ముఖ్యమంత్రి కార్యక్రమంలో గ్రూప్-4తో పాటుగా వివిధ పరీక్షల ద్వారా రిక్రూట్ అయిన 9వేల మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రలను అందజేయనున్నారు. దానిలో భాగంగా పెద్ద కల్వలలో సీఎం సభ ఏర్పాట్లకు సంబంధించి, రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్, కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి సభ వేదిక ప్రాంతం, స్టేజ్ ఏర్పాటు, హెలిప్యాడ్, విఐపి , జనరల్ పార్కింగ్ స్థలాలు, ఎక్కడ ఎక్కడా బ్యారికేటింగ్ ఏర్పాట్లు, ప్రజలు సభకు వచ్చే మార్గాలను సందర్శించి, పలు ప్రాంతాల నుండి బహిరంగ సభకు వచ్చే వాహనాలకు, ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, పర్యటన సజావుగా సాగేలా కట్టుదిట్టమైన ముందస్తు బందోబస్తు చర్యలు చేపట్టాలని, అధికారులతో పోలీస్ కమిషనర్ చర్చించి పోలీస్ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ జి. కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్ రావు, మల్లేష్ లు పాల్గొన్నారు.

# వనపర్తి లో జరిగిన దీక్షా దివస్ లో పాల్గొన్న అమరచింత బీఆర్ఎస్ నాయకులు



అమరచింత వనపర్తి నవంబర్ 29 జనం రిపోర్టర్: కెసిఆర్ దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం కల సహకారమైందని బీఆర్ఎస్ నాయకులు అమరచింత మండల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ముదిరాజ్ రమేష్ అక్కల నరసింహులు గౌడ్ అబ్రహం అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం లో జరిగిన దీక్ష దివస్ సభకు అమరచింత నుండి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. 2027లో కెసిఆర్ మళ్లీ అధికారం లోకి రావడం పద్యం అన్నారు. ఇప్పటికే 9 నెలలకు కాంగ్రెస్పై ప్రజలకు పూర్తిగా విరక్తి కలిగిందన్నారు. స్థానిక ఎన్నికల్లో ఈసారి భారత రాష్ట్ర సమితి విజయ దంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలలో నిర్వహించిన దీక్షా సభకు జనం ప్రభంజనంలా రావడమే ఇందుకు నిదర్శనమని వారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద బాలరాజు చిన్న బాలరాజు తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్‌కు రెండు రోజుల జైలుశిక్ష



నిజామాబాద్ జిల్లా (జనం రిపోర్టర్)నవంబర్ 29/: మద్యం సేవించి ఆటో నడిపినందుకు ఆటోడ్రైవర్‌కు రెండురోజుల జైలుశిక్ష పడింది. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన నసీరుద్దీన్ మద్యం సేవించి ఆటో నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలుశిక్ష విధించారు.

# అజ్ఞాత దళ కమాండర్ పూనెం రమేష్ ను బేసరత్తుగా విడుదల చేయాలి....

చిలుక శంకర్. సీపీఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు...




రామగుండం/నవంబర్ 29(జనం రిపోర్టర్): సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, దళ కమాండర్ కామ్రేడ్ పూనెం రమేష్ కాచిన పెల్లి పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని, రమేష్ ను వెంటనే కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం.సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ లో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది.ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు చిలుక శంకర్ మాట్లాడుతూ..నిన్న సాయంత్రం ఇల్లందు మండలం ఎల్లాపురం గ్రామంలో అనారోగ్యంతో ఉన్న పూనెం రమేష్ ను కాచన పల్లి పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారని ఇప్పటి వరకు రమేష్ ఆచూకీని పోలీసులు ప్రకటించక పోవడంతో కుటుంబ సభ్యులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పోలీసులు అనుసరిస్తున్న వైఖరి రమేష్ కు ప్రమాదాన్ని తలపెట్టేందుకు పూనుకుంటారని అనుమానించాల్సివస్తుందన్నారు. ప్రజల కోసం అను నిత్యం పోరాడుతున్న రమేష్ ను ఎలాంటి చిత్రహింసలకు గురి చేయకుండా,ప్రాణహాని తలపెట్టకుండా, తక్షణమే కోర్టులో హాజరు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రమేష్ ని కోర్టులో హాజరు పరిచే వరకు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం-ఎల్ న్యూడెమోక్రసీ, నాయకులు ఆర్ రాయమల్లు, ఓ సుధాకర్ ,డి సత్యం, రాధక్క, లక్ష్మక్క, పి రాజేశ్వరక్క, పద్మ ,ప్రమీలక్క, పి మంగ, సరోజన అక్క.లతో పాటు 30 మంది పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఐటి విద్యార్థుల ఉద్యోగ జాతర

టిసిఎస్ కంపెనీలో 138 మందికి ఉద్యోగాలు



నార్పల/నవంబర్ 29(జనం రిపోర్టర్): బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం నందు ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ( అటానమస్) ఇంజనీరింగ్ కళాశాలలోని 2025 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ కు చెందిన 138 మంది విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీ




టీసీఎస్ లో ఉద్యోగ అవకాశాలు పొందినట్లు కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. 138 మందిలో ఇద్దరికి ప్రైమ్ ఆఫర్ తో ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.9 లక్షల ప్యాకేజీ తో ఉద్యోగాలు వచ్చాయి. డిజిటల్ ఆఫర్ తో 21 మందికి సంవత్సరానికి రూ.7 లక్షల ప్యాకేజ్ తో, నింజా ఆఫర్ తో 115 మందికి సంవత్సరానికి రూ. 3 లక్షల ప్యాకేజ్ తో ఉద్యోగ అవకాశాలు వచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న కళాశాలలో ఎక్కువ శాతం ఉద్యోగ అవకాశాలు పొందడం ఎంతో గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రభుత్వం అందించిన ఫీజు రీయంబర్స్మెంట్ ద్వారా చదువుకొని ఉద్యోగాలు పొందిన విద్యార్థులు ఎక్కువమంది ఉన్నారన్నారు. భవిష్యత్తు తరాలు బాగుండాలి అంటే చదువే మార్గమన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని మరి కొంతమంది విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పేదరికానికి చదువు అడ్డు కాదని కష్టపడి చదివి సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రముఖ గ్లోబల్ ఐటి సేవల కంపెనీలలో ఒకటైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం ఆనందాన్ని వ్యక్తం చేసింది. విద్యార్థులు మాట్లాడుతూ.. తమకు ఉద్యోగం సాధించడానికి కృషి చేసిన ఎస్ఆర్ఐటి యాజమాన్యానికి మరియు బోధకులకు ధన్యవాదాలు తెలిపారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చిన తమకు కళాశాల యాజమాన్యం చదువు విషయంలో జాగ్రత్తలు తీసుకొని ఉన్నత స్థాయికి తీసుకొచ్చినందుకు రుణపడి ఉంటామన్నారు.

# కార్యకర్తలను కాపాడుకునేందుకు కొత్త డ్రామాలు..



ఉమ్మడి నిజాంబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) నవంబర్ 29/: జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తన కార్యకర్తలను కాపాడుకునేందుకే కొత్త డ్రామాలు ఆడుతున్నాడని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ రాంరెడ్డితో పాటు పిట్లం మండల నాయకులు అన్నారు. శుక్రవారం పిట్లంలో విలేకరులతో మాట్లాడారు. 15 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన హన్మంత్ షిండే నియోజకవర్గంలో ఏ ఒక్క భారీ పథకాన్ని తీసుకురాలేకపోయారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఏడాదిలోనే గ్రామాలకు బీటీ రోడ్లు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కళాశాల, పిట్లం, బిచ్కుందతో పాటు పలు మండలాలకు సెంట్రల్ లైటింగ్ తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనోజ్ కుమార్, వైస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పిట్లం మండలాధ్యక్షుడు హన్మాండ్లు, నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హాకీ టోర్నమెంట్ కు మాటూరి అవిఘ్న ఎంపిక

హర్షం వ్యక్తం చేసిన సీనియర్ హాకీ క్రీడాకారులు..



కరీంనగర్,జనం రిపోర్టర్, నవంబర్ 29: కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో ఈనెల 29 నుండి ఆగస్టు 01 వరకు జరగబోయే బాయ్స్ అండ్ గర్ల్స్,68వ ఎస్. జి. ఎఫ్ ఐ రాష్ట్రస్థాయి అండర్-14 హాకీ టోర్నమెంట్ కు సీనియర్ హాకీ క్రీడాకారులు మాటూరు రాజేష్ ప్రథమ కుమార్తె, హుజురాబాద్ పట్టణ కేంద్రంలో మాంటెస్సోరి స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న మాటూరి అవిఘ్న ఎంపిక అయింది..తన ఎంపిక పట్ల బండ శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్,,తోట రాజేంద్ర ప్రసాద్, చింత శ్రీనివాస్,,గుడ్డేలుగుల సమ్మయ్య, భూసారపు శంకర్, వేముల రవికుమార్, శ్యామ్, భీమగొని సురేష్, గణిశెట్టి ఉమా మహేశ్వర్, ,టీ శ్రీనివాస్, సజ్జు, ,తాళ్లపెల్లి శ్రీనివాస్ , బోడిగే తిరుపతి , కుమార్ ,నిమ్మటూరి సాయికృష్ణ,వేణు,రమేష్,వినయ్ రాజేష్, ప్రదీప్, విక్రమ్ సాంబ,పరబ్రహ్మం సీనియర్ క్రీడాకారులందరూ మరియు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

టిడిపి జీవిత కాల సభ్యత్వం పొందిన ఓగిబోయన వెంకట్

రేపల్లె నవంబర్ 29 జనం రిపోర్టర్: లక్ష రూపాయలతో తెలుగుదేశం పార్టీ జీవిత కాలం సభ్యత్వం తీసుకున్న నిజాంపట్నం మండల అధ్యక్షులు ఓగిబోయిన వెంకట్ యాదవ్ ని సన్మానించిన అనగాని శివప్రసాద్ , పంతాని మురళీధరరావు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు .ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి సభ్యత్వం 70 లక్షలు దాటిందన్నారు సభ్యత్వం నమోదులో టిడిపి పార్టీ ముందంజలో ఉంది అన్నారు.

# ఫుడ్ సేఫ్టీ పై అధికారులు దృష్టి సారించి విస్తృత తనిఖీలు చేయాలి...

సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్...



రామగుండం/నవంబర్ 29(జనం రిపోర్టర్): పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం అమలులో, గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థుల ఆహార భద్రతపై తనిఖీ అధికారులు దృష్టి సారించాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మోర్షన్ దుర్గం నగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్కారు ఆధీనంలో నడిచే హాస్టళ్ళు, గురుకులాలలో ఆహార భద్రతను పట్టించుకోకపోవడం వల్ల రాష్ట్రంలో అనేక చోట్ల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, ఫుడ్ పాయిజన్ వల్ల ఆస్పత్రుల పాలవుతున్నారని ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ మధ్యకాలంలో నారాయణపేట జిల్లా మాగనూరు బడిలో మధ్యాహ్న భోజనం వికటించి,రెండుసార్లు విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయంపై పూర్తి విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం పదార్థాలు, పాడైన కూరగాయలతో వంటలు చేయడం వల్లే ఇలాంటి సంఘటనలు ఉద్భవిస్తున్నాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. హాస్టళ్ళు, గురుకులాలు, పాఠశాలలో పెట్టే మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన విషయాలపై జిల్లా కలెక్టర్లు తరచుగా తనిఖీ చేయాలనే ప్రభుత్వం ఆదేశాలు ఉన్నప్పటికీ వారు సక్రమంగా తనిఖీ చేయలేకపోవడం వల్లనే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని ఆయన అన్నారు. నిజానికి హాస్టల్లు, గురుకులాలలో పెట్టే ఆహారాన్ని వార్డెన్లు, ప్రిన్సిపాల్ లు ముందుగా తిని రుచి చూసిన తరువాతే విద్యార్థులకు వడ్డించాలి అలాగే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రుచి చూసి విద్యార్థులకు పెట్టించాలి కానీ ఇలాంటి తనిఖీలు ఎక్కడ జరగడం లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు నాణ్యత, శుభ్రత లేని ఆహార పదార్థాలను అందిస్తున్న యాజమాన్యాలపై ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల పై కఠిన చర్యలు తీసుకోవాలి



హసన్ పర్తి మండలం నవంబర్ 29 జనం రిపోర్టర్: వరంగల్ ఉమ్మడి జిల్లాలో కొన్ని పేరుమోసిన కాలేజీలు విద్యార్థులను కాలేజీలో చేర్చుకునే సమయంలో కొందరు మధ్యవర్తుల ద్వారా ఇంటర్ కాలేజీలలో చేర్చుకొని ఆ తర్వాత ఫీజుల పేరుతో వేధించడం మాములైపోయింది ఇంటర్ స్థాయి విద్యార్థులను కూడా బయటకు పంపడం మొత్తంకాలేజి ఫీజ్ కడితేనే పరీక్ష ఫీజు చెల్లించాలి లేని యెడల పరీక్ష ఫీజు చెల్లించేది లేదు అని వేధిస్తున్నారు అటువంటి కాలేజి పై ఇంటర్ బోర్డు అధికారి చర్యలు తీసుకోవాలని విద్యార్థి రెండు సంవత్స రాలు చదివి రెండవ సంవత్స రంలో పరీక్షలు వ్రాయకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు ప్రవేట్ విద్యార్థులు చెల్లించే ఫీజ్ లతో కోట్లకు పడుగ లేత్తిన కాలేజీలు ఇప్పుడు తమ ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు వాటిపై ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలి విద్యార్థుల భావితరాల భవిషత్తు ను కాపాడాలి హాస్టల్ లో ఉండి కొంతమంది బాలికలు బాలురు ఫీజులకొరకు ప్రైవేట్ కాలేజీలు వేధించడం ద్వారా ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు మనం ప్రతి సంవత్సరం చూస్తూనే ఉన్నాం ఇంటర్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించనికాలేజీలపై ఇంటర్ బోర్డు అధికారులు తనిఖీలు నిర్వహించాలి విద్యార్థుల ఫీజులను కట్టకుండా వేదించె ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల పై కఠిన చర్యలు తీసుకోవాలి వాటి పర్మిషన్ రద్దుచేయాలని విద్యార్థుల బావి తరాల భవిష్యత్తును బోర్డు అధికారులు కాపాడాలని న్యాయ వేదిక మహిళా అధ్యక్షురాలు ఉమా రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు

# గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమం చేశాం..

**పట్టువదలని గట్టి మనిషి ఎవరైనా ఉన్నారంటే అది కెసిఆర్ మాత్రమే ..**

**దీక్ష దివాస్ కార్యక్రమంలో మాజీ అర్బన్ శాసనసభ్యులు గణేష్ బిగాల..**




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్ )నవంబర్ 29/: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్ష దివాస్ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గణేష్ బిగాల మాట్లాడుతూ గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమం చేశామని గుర్తు చేశారు కెసిఆర్ ఇచ్చిన మాట కొరకు నిజామాబాద్ జిల్లాలోని ధర్నా చౌక్ లో వంట వార్పు ,నిరాహార దీక్ష రైల్రోకో ,తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది అడ్వకేట్లు సైతం రోడ్లపై వంటవరపు కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది ఉద్యమాన్ని ఆపడానికి ఆంధ్ర ప్రయత్నాలు చాలా జరిగాయని గుర్తు చేశారు యూనివర్సిటీలోని హాస్టల్స్ బంద్ చేస్తే సొంత డబ్బులతో భోజనం అందించడం జరిగింది అన్నారు. అదేవిధంగా ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కి జీతాలు ఆపితే వారికి నేను ఏమి చేశాను అది చేశాను అని అన్నారు ధర్నాలు మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తండ్రిగారైన వేముల సురేందర్ రెడ్డి తో ధర్నా నిర్వహిస్తే ఫైర్ ఇంజన్ తీసుకువచ్చి వాటర్ తో మమ్మల్ని తడిపారని గుర్తు చేశారు. ఈ పోలీస్ స్టేషన్కు అయితే వెళ్ళామో కెసిఆర్ దయతో ఎమ్మెల్యేగా గెలిచి అదే పోలీస్ స్టేషన్ నుంచి గౌరవ వందనం స్వీకరించామని గుర్తు చేశారు. కెసిఆర్ తో కలిసి ఢిల్లీకి వెళ్లి రెండు నెలలు అక్కడే ఉండడం జరిగిందని ఎన్నో ఆటంకాల మధ్య కేసీఆర్ తో ఉండడం జరిగింది కెసిఆర్ సచ్చుడు తెలంగాణ వచ్చుడు అనే విధంగా ఢిల్లీలో చెప్తే ఆశ్చర్యానికి గురయ్యారు అని తెలిపారు. దీక్ష దివాస్తో కేంద్రం హడలెత్తిపోయి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కి నాంది పలికింది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆశన్న జీవన్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి,దీక్షా దివాస్ ఇంచార్జ్ ఫారుఖ్ హుస్సేన్,బాజిరెడ్డి గోవర్ధన్,బోధన్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆయేషా ఫాతిమా షకీల్,మాజీ జడ్పి ఛైర్మన్ విఠల్ రావు,సీనియర్ నాయకులు రాంకిషన్ రావు,నగర అధ్యక్షులు సిర్ప రాజు ప్రభాకర్ రెడ్డి,సత్యప్రకాశ్, సుదాం రవిచందర్, రాజారాం యాదవ్,అలీం,బాజిరెడ్డి జగన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమ కారులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట ప్రకారం మల్లంపల్లి మండలం చేశాం



ములుగు /నవంబర్ 29(జనం రిపోర్టర్): పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా అభివృద్ధి శాఖ మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నూతన మల్లంపల్లినీ మండలం గా ప్రకటించినం అని అన్నారు మండల ప్రజలకు నా శుభా కాంక్షలు – రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మరియు గ్రామీణ నీటిపారుదల శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే మల్లంపల్లి మండలం గా ప్రకటించడం జరిగిందని మాట ఇస్తే తప్పని పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం మల్లంపల్లి మండలం ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చెయ్యడం జరిగిందని త్వరలోనే మండల కార్యాలయాలు నిర్మించి పరిపాలన అందిస్తామని మంత్రి వర్యులు సీతక్క అన్నారు ఈ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడా కుల అశోక్ గారితో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు మండల సాధన సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల బంద్ ను విజయవంతం చేయండి

**ఎస్ ఎఫ్ ఐ, ఎ ఐ ఎస్ ఎఫ్, పి డి ఎస్ యు, ఎ ఐ పి ఎస్ యు,**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) నవంబర్ 29/: వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రేపు జరిగే ప్రభుత్వ పాఠశాల బంద్ ను విజయవంతం చేయాలని ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్, పిడి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో వాపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు బి.రఘురామ్, జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి ఫుడ్ పాయిజన్ తో 51 మంది విద్యార్థులు చనిపోయారని, ముఖ్యంగా గురుకుల ,కేజీవిపి, ఆశ్రమ పాఠశాలు, ప్రభుత్వ స్కూల్స్ లో తరచుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని, నాణ్యమైన పోషక ఆహారం పెట్టాడటం లేదని , సంబంధిత విద్యాశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సరైంది కాదని, ఫుడ్ పాయిజన్ తో చనిపోయిన విద్యార్థులకు ఎక్స్గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రేపు జరిగే బంద్ కి విద్యార్థులు విద్యార్థి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు నరేందర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కుషాల్, పిడిఎస్ యు ఆర్మూర్ డివిజన్ అద్యక్షులు ప్రిన్స్, పిడిఎస్ యు జిల్లా నాయకులు మనోజ్,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం...



రామగుండం/నవంబర్ 29(జనం రిపోర్టర్): స్థానిక గాంధీ నగర్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.. అనంతరం నాయకులను ఉద్దేశించి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ,డిసెంబర్ 4న. 2024 బుధవారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగే నిరుద్యోగ విజయోత్సవ సభకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, డివిజన్ నుండి భారీ సంఖ్యలో ప్రజలను తరలించడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, రామగుండం నియోజకవర్గంలో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపల్లి సభా వేదిక నుండే వర్చువల్ గా ప్రారంభిస్తారని, అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నమోదుకు డిసెంబర్ 9, 2024వరకు గడువు పొడిగించారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరొక్కసారి పెద్దఎత్తున నమోదు చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశ కార్యక్రమంలో నగర మేయర్, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## అనాధ శవానికి అంత్యక్రియలు జరిపిన యువకుడు.



పొన్నూరు నవంబర్ 29 జనం రిపోర్టర్: పొన్నూరు పట్టణం నిడుబ్రోలు ప్రాంతంలో ఓ అనాధ వృద్ధ శవానికి అంత్యక్రియలు జరిపిన యువకుడు నలుగురి ప్రశంసను పొందిన ఘటన శుక్రవారం జరిగింది. నిడుబ్రోలు ప్రాంతంలో అనాధ వృద్ధుడు చనిపోయి ఉండగా దారిని పోతూ చూస్తున్నా ప్రజలు అయ్యో పాపం అన్న వారే తప్ప మృతదేహం సమాచారం ఇటు పోలీసులకు గాని స్వచ్ఛంద సంస్థలకు గాని తెలియపరచకుండా చూస్తూ ఉండటం గమనించిన విద్యావంతుడైన యువకుడు డి రాజ్ కుమార్ ప్రైవేట్ కళాశాలలో విద్యాబోధన చేస్తుంటాడు. వృద్ధ మృతదేహాన్ని చూసి చలించిపోయి తమ వారు ఎవరైనా వచ్చి తీసుకెళ్తారేమో అని ఎదురుచూసి శశెమిరా అన్న మనసు మాటకు కట్టుబడి ఆ వృద్ధుడి మృతదేహాన్ని తన సొంత నగదుతో పలువురు సాయం కోరి అంత్యక్రియలు జరిపించాడు. అప్పటికి ఆ యువకుడు మనసు కుదుటపడింది. రోడ్డు పక్కన చనిపోతున్న అనాధ శవాలను చూసి వెళ్ళకుండా సంబంధిత అధికారులకు తెలియజేసి కాస్త పుణ్యం కట్టుకుంటే మంచిదని యువకుడు రాజకుమార్ హితవు పలికాడు. యువకుడు రాజకుమార్ చేసిన కార్యక్రమానికి పలువురు ప్రశంసలు కురిపించారు.

## 9 మంది వ్యక్తులకు 25,500/- రూపాయల జరిమానా మరియు ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష..



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్ )నవంబర్ 29/: శుక్రవారం అనగా తేదీ 29.11.2024. మద్యం తాగి వాహనం నడిపిన టువంటి 12 మంది వ్యక్తులకు పి ప్రసాద్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం వారిని కోర్టు నందు హాజరుపరచగా అహ్మద్ మొయిద్దీన్ , సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ 9 మంది వ్యక్తులకు 25,500/- రూపాయల జరిమానా మరియు ఇద్దరికీ 1) దిడి రాజు తండ్రి కిష్టయ్య నివాసం ఏళ్ళమ్మగుట్ట, నిజామాబాద్ కి 2 రోజులు మరియు 2) హుస్సేన్ బిన్ సలీం నివాసం దారు గల్లి, నిజామాబాద్ కి మూడు రోజుల జైలు శిక్ష విధించడం జరిగింది. కావున వాహన చోదకులు మద్యం సేవించి వాహనములు నడపరదని లేని యెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడునని ట్రాఫిక్ ఏసీపి నారాయణ తెలియజేసినారు.

## దేశ ధర్మ రక్షణకై బజరంగ్దళ్ లో చేరండి హిందూ యువతకి బజరంగ్ దళ్ పిలుపు....

**బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్....**



రామగుండం/నవంబర్ 29(జనం రిపోర్టర్): బజరంగ్ దళ్ శౌర్య యాత్ర త్రిశూల్ దీక్ష కార్యక్రమం డిసెంబర్ 1న. ఆదివారం శ్రీకోదండ రామాలయంలో నిర్వహించడం జరుగుతుంది. పారిశ్రామిక ప్రాంతంలోని హిందూ యువత త్రిశూల్ దీక్ష కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయగలరని ఆహ్వానిస్తున్నాం, ధర్మం కోసం పనిచేసే యువతకు భజరంగ్దళ్ పిలుపుతో శౌర్యాత్రకి ఆహ్వానిస్తున్నాం అని తెలిపారు. స్థానిక విశ్వహిందూ పరిషత్ భవనంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ గోదావరిఖని నగరంలోని ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ ఆధ్వర్యంలో డిసెంబర్ న ఆదివారం గోదావరిఖనిలో శ్రీ కోదండ రామాలయంలో శౌర్య యాత్ర బజరంగ్ దళ్, త్రిశూల్ దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. పారిశ్రామిక ప్రాంతంలోని పారిశ్రామిక ప్రాంతంలోని యువతని దేశ ధర్మ రక్షణ కోసం పని చేసే కార్యకర్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా, బజరంగ్ దళ్ సమాజంలో పని చేస్తుందని మత్తు మాదక ద్రవ్యాలకి దూరంగా ఉండి, హిందూ యువత దేశం ధర్మం కోసం పనిచేయాలని కార్యకర్తలకు సూచిస్తుందని తెలిపారు. దేశ ధర్మం కోసం త్రిశూల్ దీక్ష కార్యక్రమంలో 500 మంది బజరంగ్దళ్ నూతన కార్యకర్తల నియోక్తి జరుగుతుందని, నూతనంగా 500 మంది కార్యకర్తలు బజరంగ దళ్ లో చేరుతున్నారని 500 మంది కార్యకర్తలతో గోదావరిఖని నగరంలో కవాతు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నరసింహమూర్తి,బజరంగ్ దళ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ అయోధ్య రవీందర్, హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్, సంపత్ యాదవ్,వెంకట స్వామి, అడిగొప్పుల రాజు ,రాజేశం ,రావుల శ్రీనివాస్, శివ,అరవింద్ ,ములుగుండ్ల శ్రీనివాస్, వెంకటేష్, మద్దెల శ్రీనివాస్, ఆరెల్లి జలంధర్, చక్రపాణి తదితరలు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్కు ఆంగ్ల మాధ్యంలో హల్ టికెట్లు ఇవ్వాలి.



మొగల్తూరు/నవంబర్ 29(జనం రిపోర్టర్): నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు సంబందించి తమ పిల్లలకు ఆంగ్ల మాధ్యం లో నిర్వహించేలా హాల్ టికెట్లు ఇవ్వాలంటూ ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లి తండ్రులు శుక్రవారం ఆందోళన చేశారు. పాఠశాలలో 8వ తరగతి చదివే 54 మంది విద్యార్థులు ఈపరిక్షలకు ధర ఖాస్తు చేశారు. ఈ పరీక్షలకు సంబందించి విద్యార్థులు పాఠశాల ద్వారా ఆంగ్లమాధ్యమంలో ధరఖాస్తు చేసుకోగా ఆన్లైన్లో ధరఖాస్తులు చేసిన పాఠశాల సిబ్బంది తెలుగుమీడియంకు ధరఖాస్తు చేశారు. డిసెంబర్ 8న జరిగే ఈపరీక్షకు సంబందించి శుక్రవారం హాల్ టికెట్లు వచ్చాయి. అయితే తెలుగు మీడియంలో పరిక్ష జరిగే విధంగా హాల్ టికెట్ రావడంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాఠశాలలో ఆందోళనకు దిగారు. 54 మంది విద్యార్థుల్లో ఒకరికి మాత్రమే ఆంగ్లమాధ్యంగానూ మిగిలిన విద్యార్థులకు తెలుగు మీడియంలోనూ హాల్ టికెట్లు వచ్చాయి. ఈసందర్భంగా తల్లితండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు ఆంగ్లమాధ్యంలోనే చదువుతున్నారని ఈ పరిక్షలకు ఆం గ్లమాద్యంలో ధరఖాస్తు చేయాల్సిన పాఠశాల సిబ్బంది తెలుగుమీడియంకు ధరఖాస్తు చేశారన్నారు. ఫలితంగా తమ పిల్లలు ప్రిపరేషన్ వృధాగా మారనుందని ఆందోళన చేశారు. తల్లితండ్రులుతో ప్రధానోపాధ్యాయుడు రామరాజు మాట్లాడుతూ ధరఖాస్తు సమర్పించడంలో తమ సిబ్బంది లోపంకారణంగా తెలుగుమీడియం హాల్ టికెట్లు వచ్చా యని సమస్యను డిఈవో, రాష్ట్ర స్థాయి పరిక్షల నిర్వాహకులతో మాట్లాడి అందరు విద్యార్థులు ఆంగ్లమాధ్యమంలో పరిక్ష రాసే విధంగా హాల్ టికెట్లు ఇప్పించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో దొంగ ప్రసాద్, కవురు ముత్యాలరావు, కడలి యోగానంద, కాండ్రేకుల సత్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ కొల్లాటి చూడామణి తదితరులున్నారు.

## నేడు మండల పరిషత్ సమావేశం



మొగల్తూరు.నవంబరు29. జనం రిపోర్టర్:మొగల్తూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సిహెచ్ త్రిశూల పాణి తెలిపారు. ఎంపీపీ అందే సూర్యావతి అధ్యక్షతన నిర్వహించే ఈసమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎం పీటీసీలు, సర్పంచ్ లు హజరు కావాలని కోరారు.

## లేసు అల్లికలకు ప్రోత్సాహం...




మొగల్తూరు,నవంబరు29. జనం రిపోర్టర్: లేసు అల్లికలను ప్రోత్సహించేందుకు మహిళల నైపుణ్యాభివృద్ధికి కేంద్ర హస్తకళల ద్వారా మరింత ప్రోత్సా హకాలను అందిస్తున్నట్టు సౌత్ ఇండియా హ్యాండీ క్రాఫ్ట్స్ రీజినల్ డైరక్టర్ ఏ. లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం కెసి పాలెంలో నిర్వహిస్తున్న గురు శిష్య హస్త శిల్పి ప్రశిక్షన్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి లేస్ అల్లికలల్లో శిక్షణ పొందుతున్న మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. లేసు అల్లికల మహిళా అభివృద్ధికి భౌగోళిక గుర్తింపుకు కృషి చేస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ అసిస్టెంట్ డైరక్టర్ ఆపర్ల లక్ష్మి. సీనియర్ కన్సల్టెంట్ ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన కార్పొరేటర్



హసన్ పర్తి మండలం నవంబర్ 29 జనం రిపోర్టర్ : వరంగల్ నగర పరిధిలోని హసన్ పర్తిమండలం ఎల్లాపూర్ గ్రామం 65వ డివి జన్ గురువారం రాత్రి 10 గంటలకు వెలిశోజు సాంబయ్య చారి,బిఆర్ఎస్ కార్యకర్త ఆకస్మికంగా మరణించడంతో శుక్రవారం కార్పొరేటర్ దివ్యారాణి రాజు నాయక్ అతని నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను పరమశించడం జరిగింది ఈ కార్యక్రమంలో పి.ఎ.సిఎస్ వైస్ చైర్మన్ .పాడి మల్లారెడ్డి. ఎల్లాపూర్ గ్రామ మాజీ సర్పంచులు పాడి .రామకృష్ణారెడ్డి. దేవన బోయిన .కుమారస్వామి ,బి ఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దోమల .శ్రీనివాస్ ,బిఆర్ ఎస్ యూత్ అధ్యక్షుడు బొర్ర .సురేష్, మధ్యల.తిరుపతి, చిట్యాల.కమలాకర్, గోలి.విద్యాసాగర్ రెడ్డి, నల్లాల .సందేశ్, గంగిళ్ళ .భాస్కర్ రెడ్డి,దేవన బోయిన.శంకర్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నేదునూరి.సునీల్ వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముల్లమూరి వెంకటరామయ్య సహకారంతో దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు భోజనం పంపిణీ



/నవంబర్ 29(జనం రిపోర్టర్): వివరాల్లోకి వెళితే దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ వారు మేము సైతం కార్యక్రమంలో భాగంగా వివాహాది శు భకార్యాలయాలలో మిగిలిన భోజనాన్ని సేకరించి పేదలకు పంచుతున్నారు ఈ కార్యక్రమంలో భాగంగా 8500009928 నంబర్కు సంప్రదించి భోజనం అందించాలని ఫౌండర్ నరసింహారావు తెలియజేయడం జరిగింది ఈ ప్రకటన చూసి పొదిలి బెస్త బాలమ్మ కి చెందిన ముల్లమూరి వెంకట రామయ్య గారు ఈరోజు అయ్యప్ప స్వామి భక్తులకు భోజన వసతి కల్పించి ఆ మిగిలిన భోజనాన్ని ఫౌండేషన్ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ భోజనాన్ని ఫౌండేషన్ సభ్యులు బద్ధపరిచి పొదిలి కాలేజీ రోడ్ లోనే శ్రీపతి నగర్ లో నివసిస్తున్న నిరుపేదలకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో బత్తిని నరసింహారావు, రాధా, ఫౌండర్ నరసింహారావు పాల్గొన్నారు

## టిడిపి కార్యకర్తకు ఆర్థిక సాయం

నార్పల /నవంబర్ 29(జనం రిపోర్టర్): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త పోతులయ్యకు శివకృష్ణ ట్రస్ట్ చైర్మన్ మెల్లంపూటి శివకృష్ణ చౌదరి 20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. పోతులయ్య అనారోగ్యంతో కడపలోని రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న శివకృష్ణ చౌదరి ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. తొందరగా సంపూర్ణ ఆరోగ్యంతో పోతుల కోలుకోవాలని శివ కృష్ణ చౌదరి ఆకాంక్షించారు.

## కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ఓరుగల్లు వాసులకు మరో విభజన హామీని నెరవేర్చిన కేంద్ర ప్రభుత్వం.**




హసన్ పర్తి మండలం నవంబర్ 29 జనం రిపోర్టర్: వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 45 వ డివిజన్ పరిధిలోని అయోధ్య పురంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించబోయే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రాంతాన్ని పరిశీలించి,అనంతరం మడికొండ చౌరస్తాలో భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న వర్ధన్నపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది, ప్రస్తుతం నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చర్ యూనిట్ ను అప్ గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీ గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేయడం వల్ల వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి, ఇప్పటికే గిరిజన వర్సిటీ ఏర్పాటు చేసిన కేంద్రం ప్రభుత్వం తాజాగా కోచ్ ఫ్యాక్టరీ ని కూడా మంజూరు చేయటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, తక్కల్లపల్లి రాజేశ్వరరావు, మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాం నాయక్, జలగం రంజిత్, కరుణాకర్, వెంకట్రావు గడ్డం మహేందర్, పిట్టల రమేష్, దువ్వ నవీన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



## వార్షికోత్సవ వేడుకలలో సుగవాసి బాలసుబ్రమణ్యం



నందలూరు /నవంబర్ 29(జనం రిపోర్టర్): మండల పరిధిలోని నీలిపల్లె లో కొలువైన శ్రీ మహా గణపతి దేవస్థానం 10 వ వార్షికోత్సవం లో రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ సుగవాసి బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, ఎన్ డి ఏ కూటమి నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువలతో సత్కరించి సన్మానించారు. శుక్రవారం నాడు వార్షికోత్సవ సందర్భంగా కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శ్రీ వినాయక స్వామి ఆలయాన్ని దర్శించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన హోమగుండం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, మాజీ ఎంపిటిసి పల్లె సుబ్రహ్మణ్యం, సుధీర్, నారపుశెట్టి శివ, రెడ్డయ్య, పల్లె కృష్ణ, మోడపోతుల రాము, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## నేను కూడా తెలంగాణ కోసం ఉద్యమం చేశాను..




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) నవంబర్ 29/: తెలంగాణ ఉద్యమ సమయంలో తానూ దీక్ష చేశానని, మంత్రి పదవిని సైతం త్యాగం చేశానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ దీక్షా దివస్ జరుపుకునే అవసరం లేదని, తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చిందని గుర్తు చేశారు. అందుకే తాము సెక్రటేరియట్లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కనీసం మోటారు ప్రారంభం చేయకుండానే రైతులు కోటిన్నర ఎకరాల పంట పండించారని తెలిపారు. సన్న రకానికి బోనస్ కూడా ఇస్తున్నామన్నారు ఇప్పటికే రూ.73 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ 85 శాతం పూర్తయిందని, త్వరలోనే వందశాతం పూర్తి చేస్తామన్నారు. ప్రధానంగా నిజామాబాద్ జిల్లాలో ఫ్లైఓవర్ పనులు వీలైనంత తొందరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు కావాలని తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. మాధవనగర్ ఆర్వోబీకి సంబంధించి పెండింగ్ లో ఉన్న రాష్ట్ర వాటా రూ.8 కోట్లు వచ్చే సోమవారం విడుదల చేస్తామన్నారు. అలాగే డిసెంబర్ మొదటి వారంలో ప్రధాని నరేంద్ర మోడీని కలుస్తున్నామన్నారు. అప్పుడే పసుపు బోర్డు ప్రస్తావన కూడా లేవనెత్తుతానన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్, నాయకులు వినయ్ రెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దీక్షా దివాస్ సందర్భంగా సభలో పాల్గొన్న మాజీ మంత్రి జిల్లా ఇంచార్జ్ కొప్పుల ఈశ్వర్...

రామగుండం /నవంబర్ 29(జనం రిపోర్టర్): దీక్షా దివాస్ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న మాజీ మంత్రి జిల్లా ఇంచార్జ్ కొప్పుల ఈశ్వర్.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధుకర్, దాసరి మనోహర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాతు....స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో కీలకమైన మలుపు తిప్పిన రోజు కేసిఆర్ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన రోజు నవంబర్ 29.వ తేదీ అని కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడోనని నినదించి, 11 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ఉద్యమాన్ని విజయ తీరాలకు మరల్చిన కల్వకుంట చంద్రశేఖర్ రావు స్వరాష్ట్ర ఉద్యమ చరిత్రగా నిలిచారు. తెలంగాణ ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్యలకు స్వరాష్ట్ర సాధనే పరిష్కారమని, అసెంబ్లీ సాక్షిగా చెప్పి డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీని స్థాపించారు. 2001 నుండి తెలంగాణ వచ్చేవరకు ఎన్నో ఉద్యమాలు కార్యక్రమాలు కట్టలు తెగుతున్న ప్రజా ఆగ్రహాన్ని ప్రజా సంఘాల, ఉద్యమ కారులతో కలిసి ప్రభుత్వాన్ని రాజకీయ ప్రక్రియగా మర్చి కేంద్రం మెడలు వంచి స్వరాష్ట్ర లక్ష్యాన్ని నేరవేర్చిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు తెలంగాణ అంటే భీడు భూములు, వలసలు, ఆకలి చావులు..! కెసిఆర్ ఆ రోజు ఒక మాట చెప్పింద్రు ఈ ఉద్యమాన్ని అనేక మంది చేసింద్రు కాని విఫలమయ్యారు..! అధికారంలో ఉన్న ఆంధ్ర పాలకులు అనచివేసింద్రు అప్పటికే 1969 ఉద్యమంలో చేదు అనుభవం 371 మంది ఉద్యమకారులను పొట్టన పెట్టుకుంది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం...! ఇక చేసే ఉద్యమం శాంతియుతంగా ముందుకు పోవాలని, మడమ తిప్పకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొవలనే ఉద్దేశంతోనే అనేక ఉద్యమ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది..! అందులో భాగంగానే మానవహారం, చలో ఢిల్లీ, రాజీవ్ రహదారి దిగ్బంధం, వంటావార్పు, రైలు రోకో కార్యక్రమం, సకలజనుల సమ్మె, అందులో భాగంగానే నవంబర్ 29 దీక్షా దివస్ ఆని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడానికి దీక్షా దివస్ ఒక మలుపు తిప్పింది. ఇది చరిత్ర లో లిఖించదగిన విషయం,తెలంగాణ లో ఏ చరిత్రకారుడు చరిత్ర రాయాలన్నా ఈ సంఘటనను మినహాయించి ఒక అక్షరం రాయలేరన్నారు. ఆనాడు కెసిఆర్ పార్లమెంట్ సభ్యులుగా ఉండి 2006 లో తెలంగాణ పై ప్రజల అభిప్రాయం తెలుసుకుందామని తన పదవికి రాజీనామా చేసిండు కేసీఆర్ రాజీనామా చేసి, కరీంనగర్ గడ్డమీద పార్లమెంటు స్థానంలో రెండు లక్షల మెజారిటీతో గెలిచిన చరిత్ర కేసీఆర్ ది, 2008 లో తెలంగాణ కోసం 16 మంది ఎమ్మెల్యే 4 ఎంపీలు, 4 ఎమ్మెల్సీలు పదవులను రాజీనామా చేయడం జరిగింది. తరువాత 2010 లో కూడా మళ్ళీ పదవులను త్యాగం చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నో అబద్ధపు హామీలు, 420 గ్యారంటీలూ మాటలు చెప్పి కాంగ్రెస్ వాళ్లు అధికారంలోకి వచ్చారు. తెలంగాణలో ఏ వర్గాన్ని నమ్మించి గొంతు కోశారన్నారు. ఆనాటి కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో మళ్లీ తెలంగాణలో మరో పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని.! కేసీఆర్ దీక్ష స్ఫూర్తిగా మరోసారి కాంగ్రెస్ పార్టీ మీద పోరాటం చేయాలని కార్యకర్తకు సూచించారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ పోరాటం చేయాల్సి ఉంటుందన్నారు.రాబోయే నాలుగేళ్ల ప్రజల కోసం పోరాటం చేద్దాం. ప్రతి వేదికలో తెలంగాణ పక్షాన పోరాడుదాం అని తెలిపారు.





## అతివేగంతో బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి



ఇబ్రహీంపట్నం, నవంబర్ 29 జనం రిపోర్టర్ : బైకు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఇబ్రహీంపట్నం ఎస్ఐ ఏ. అనిల్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని సాయిరాం కాలనీ కి చెందిన ఆరే రమేష్ గత కొంతకాలంగా మేడిపల్లి గ్రామంలో వారి వృత్తి సీత కమ్మరి పని చేసుకుంటూ కుటుంబంతో పాటు నివసిస్తున్నాడు. శుక్రవారం పని నిమిత్తం మేడిపల్లి నుండి మెట్‌పల్లి కి అతని బండి పై అతివేగంగా అజాగ్రత్తగా వెళుతూ ఇబ్రహీంపట్నం క్రాసింగ్ వద్ద అదుపుతప్పి పక్కనున్న చెట్టును ఢీకొని బండరాళ్లపై పడి తీవ్ర గాయాలు అవ్వగా వెంటనే మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించినాడని అతని భార్య ఆరే జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంఘటన స్థలాన్ని పరిశీలించి శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ ఏ. అనిల్ కుమార్ తెలిపారు.



## రికార్డులు తానికిచేసిన డిఎస్పీ




రేపల్లె నవంబర్ 29 జనం రిపోర్టర్: రేపల్లె డిఎస్పీఆవుల శ్రీనివాసరావు యాన్యువల్ ఇన్స్పెక్షన్ లో భాగంగా నగరం పోలీస్ స్టేషన్ సందర్శించి పోలీస్ స్టేషన్ పరిసరాలను మరియు రికార్డులను ఫైల్స్ నుశుక్రవారం తనిఖీ చేసి మరియు సిబ్బందితో మహిళా పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి యొక్క సమస్యల గురించి తెలుసుకొని వార్షిక తనిఖీ చేసి సంతృప్తికరం వ్యక్తం చేసి శాంతి భద్రత గురించి తగు సూచనలు చేసినారు ఈ కార్యక్రమంలో రేపల్లె రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గారైన ఆర్ సురేష్ బాబు గారు నగరం సమస్య పెక్టర్ ని భార్గవ్ మరియు నగరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు...

# హనుమకొండలో దీక్ష దివస్ కార్యక్రమం

## మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



హసన్ పర్తి మండలం /నవంబర్ 29(జనం రిపోర్టర్): నా గులాబీకుటుంబసభ్యులకు ఉద్యమ వందనాలు స్వరాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరిలూదిన రోజు మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు తెలంగాణ వచ్చుడో. కేసీఆర్ సచ్చుడో' అని నినాదమిచ్చి రాష్ట్ర సాధన కోసం మృత్యువును సైతం ముద్దాడేందుకు కేసీఆర్ తెగించిన రోజు నవంబర్ 29 ఉద్యమనేత కేసీఆర్ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాటానికి దిగి. కేంద్రం మెడలు వంచి తెలంగాణ సాధనకు అడుగుపడిన రోజు నాలుగు కోట్ల జనం జై తెలంగాణ, మా తెలంగాణ మాకు కావాలి అని కొట్లాడిన తరుణం 2001 నుంచి 2014 స్వరాష్ట్రం సాధించే వరకు సాగిన పోరాట, ఉద్యమ నేపథ్యాలు అనేకం 60 ఏండ్ల తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాకారం వేసిన వీరుడు కేసీఆర్ సకల జనుల జంగ్ సైరన్ ఢిల్లీ కోటలను బీటలు పారించింది విద్యార్థులు, ఉద్యోగులు, గులాబీ శ్రేణులు , సబ్బండ వర్గాలు ఏకమై తెలంగాణ కోసం పోరాటం చేశారు తెలంగాణ కోసం ప్రాణ త్యాగానికి సైతం వెనకాడలేదు తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పదవులను తృణప్రాయంగా వొదిలేశాం మనసా, వాచా, కర్మణా తెలంగాణ కోసం 2001 నుంచి 2014 వరకు మనం అందరం కలిసి కొట్లాడాం కాళోజీ కవితలు, జయశంకర్ సార్ మార్గదర్శకత్వంలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడం జరిగింది అన్ని వర్గాలను, అన్నికులాలను కలుపుకొని ఉద్యమించడం జరిగింది దగాపడ్డ తెలంగాణ దాస్య శృంఖలాలు తెంచి. బంగారు తెలంగాణను రూపుదిద్దిన మహానాయకుడు కేసీఆర్ దీక్షా దివస్ కార్యక్రమాన్ని 2015 నుంచి 2024 వరకు హనుమకొండ కేంద్రం ప్రతీ ఏటా నిర్వహించడం మీ అందరికీ తెలిసిందే. తెలంగాణ ఉద్యమంలో ఓరుగల్లు ఉద్యమ వీరులది ప్రత్యేక స్థానం మీ అందరితో పాటు నేను ఉద్యమంలో భాగమైనందుకు సంతోషిస్తున్నాను తెలంగాణ ఉద్యమం నన్ను మీ అందరికి నన్ను దగ్గర చేసింది మీకు నాకు పేగు బంధం, ఉద్యమ అనుబంధం ఉద్యమకారులకు నేను అండగా ఉంటా అని తెలియజేశారు అనంతరం ముఖ్య అతిథి ఎమ్మెల్సీ వాణీ దేవి కామెంట్స్ దిక్షా దివస్ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లాలో ఘనంగా నిర్వహించాం ఉద్యమకారులను, పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు ఉద్యమ చరిత్రను తెలిపేలా ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహిద్దాం నవంబర్ 29 న తెలంగాణ చరిత్రలో చారిత్రాత్మక రోజు అప్పుడున్న పరిస్థితులలో కేసీఆర్ చేసినటువంటి.దీక్షను చూసినటువంటివారు.ప్రతి ఒక్కరు కంటతడి పెట్టారు. చరిత్ర ఎప్పటికీ చెరిగిపోదని, కేసీఆర్ అంటే తెలంగాణ కు దిక్సూచి అని అన్నారు. 60 ఏండ్ల తెలంగాణను సాకారం చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు రాజ్య సభ మాజీ సభ్యులు కెప్టెన్ లక్ష్మి కాంత రావు కామెంట్స్ నిఖార్సైన ఉద్యమ నేత కేసీఆర్ తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటే ధ్యేయంగా పని చేసిన ఉద్యమ నాయకుడు గల్లీ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ వాదాన్ని విస్తరింపజేసి , తెలంగాణను సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ కేసీఆర్ కేంద్ర మంత్రి పదవులు, ఎమ్మెల్యే పదవులను తెలంగాణ కోసం తృణప్రాయంగా త్యాగచేసిన మహానేత సోనియా గాంధీ, మన్‌మోహన్ సింగ్, నాటి కాంగ్రెస్ పెద్దలను ఒప్పించి తెలంగాణ తెచ్చిన కృషీ వలుడు దేశంలోని అన్ని పార్టీల అధినాయకులను ఒప్పించి తెలంగాణకు స్వేచ్ఛను తీసుకొచ్చిన యోధుడు 2009 నవంబర్ 29 దీక్ష ఒక చరిత్ర తెలంగాణ రాష్ట్ర అంతా కేసీఆర్ వైపు చూసింది కరీంనగర్ నుంచి సిద్ధిపేట దీక్షకు వెళ్తున్న కేసీఆర్‌ను నాడు అక్రమ అరెస్ట్ చేసి ఖమ్మం తరలించారు నాడు నాయిని నర్సింహారెడ్డి, నేను, రాజయ్య, కేసీఆర్ జైలు జీవితం అనుభవించాం నాడు పోలీసుల నిర్బంధాల మధ్య ఉద్యమం సాగింది అయినా గమ్యాన్ని ముద్దాడింది కేసీఆర్ ఏకైక లక్ష్యం తెలంగాణ స్వరాష్ట్ర సాధన మాత్రమే అది నెరవేర్చారు. ఎందరికో స్ఫూర్తి కేసీఆర్ ఘనంగా దీక్షా దివస్ కార్యక్రమ నిర్వహణ మొదట అదాలత్‌లోని అమరవీరుల స్థూపానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాలినడకన నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ సర్,భారత తర్న అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలోని తెలంగాణ తల్లికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆతదనంతరం ఏర్పాటు చేసిన ఉద్యమ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. పెద్ద ఎత్తున అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమ చివరలో ముఖ్య అతిథులను మెమొంటోలు అందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ బాబు, చల్లా ధర్మారెడ్డి, మాజీ చైర్మన్లు నాగూర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవ రెడ్డి, సంగంరెడ్డి సుందర్ రాజ్‌యాదవ్, కార్పొరేటర్లు, మాజీ జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి మృతి

**అనారోగ్యం వుండటం తో విద్యార్థికి టాబ్లెట్స్ ఇచ్చారు....**

**మూడో ఫ్లోర్ నుంచి వస్తుండగా ఒకటో ఫ్లోర్లో కుప్పకూలిన శివ జశ్విత్ రెడ్డి**

**కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తున్న యాజమాన్యం నిర్లక్ష్యం**

**కనీసం హాస్పిటల్కు వచ్చి చూడని వైనం**

**ఆవేదన వ్యక్తం చేసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు..**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్ )నవంబర్ 29/: తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి మృతి మృతి చెందిన ఘటన శుక్రవారం కాకతీయ పాఠశాలలో చోటుచేసుకుంది. బోధనకు చెందిన శివ జశ్విత్ రెడ్డి నిజామాబాద్ నగరంలో కాకతీయ స్కూల్లో హాస్టల్ ఉంటూ తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి అనారోగ్యం బారీన పడడంతో విద్యార్థి పాఠశాల వాడెన్ కు తెలిపాడు. సదరు వాడెన్ విద్యార్థికి వామి కాయిన్ టాబ్లెట్ ఇచ్చానని తెలిపారు. బాబుకు గురువారం రాత్రి 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఉదయం వస్తామని తెలిపారని స్థానికులు తెలుపుతున్నారు. అలాగే రాత్రి 10 గంటలకు సైతం తమ బాబుతో మాట్లాడమని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఉదయం ఏడు గంటలకు కూడా తల్లిదండ్రులు ఫోన్ చేశారని బాబుతో మాట్లాడామని చెప్పారు. ఆ తర్వాత 9 గంటల 45 నిమిషాలకు పాఠశాల హాస్టల్ వద్దకు చేరుకోగా మూడో ఫ్లోర్ ల ఉన్న శివ జశ్విత్ రెడ్డి నడుచుకుంటూ ఒకటవ ఫ్లోర్ కు రాగానే కుప్పకూలి పడిపోయాడు. విషయం తెలుసుకున్న తండ్రి బాబును ఎత్తుకొని పక్కనే ఉన్న ప్రతిభ ఆసుపత్రిలో చేర్పించారు. ఆస్పత్రి వైద్యులు మొదట ఈసీజీ చేసి శివ జస్విత్ రెడ్డి మృతి చెందాడని 10:02 నిమిషాలకు వైద్యులు దృవీకరించారు. వామి కైండ్ టాబ్లెట్ ఇచ్చాను ఏమయిందో తెలువదు అంటున్న హాస్టల్ వార్డెన్ తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకొని వెళ్లే సమయంలో తప్పనిసరిగా పాఠశాల యాజమాన్యం రావాల్సిందేనని పట్టుకొని కూర్చున్నారు. పాఠశాల యాజమాన్యం రాలేక హాస్టల్ వాడెను పంపించారు. అక్కడికి వచ్చిన హాస్టల్ వార్డెన్ శివ జశ్విత్ రెడ్డి కి వామిటింగ్ చేసుకుంటున్న అని చెప్పడంతో కేవలం వామి కైండ్ టాబ్లెట్ మాత్రమే ఇచ్చానని చెప్పుకొచ్చాడు. ఆ తర్వాత ఏమయిందో తనకు తెలవదని వారి ముందు చెప్పుకొచ్చాడు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థి మృతి యాజమాన్యం నిర్లక్ష్యమే అంటున్న కుటుంబ సభ్యులు

%తమ పాఠశాలలో చదువుకుంటున్న 9వ తరగతి విద్యార్థి శివ జశ్విత్ రెడ్డి మృతి యాజమాన్యం నిర్లక్ష్యమేనని తల్లిదండ్రులు భాస్కర్ రెడ్డి, శ్రావణి ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి నుండి బాబుకు వామిటింగ్స్ అయితే పక్కనే ఉన్న హాస్పిటల్లో చూపించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. మేము వచ్చాకే హాస్టల్ నుండి పడిపోయిన విద్యార్థిని తీసుకొని పోయి పక్కన ఉన్న ప్రతిభ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు పరీక్షించి ఈసీజీ చేసి సాత్యుయేషన్ చూశాక మృతి చెందాడని తెలియజేశారన్నారు. పాఠశాల యాజమాన్యం ఎంత నిర్లక్ష్యం వహిస్తుందో అర్థమవుతుందని చేతు కందిన కొడుకు పాఠశాలలో మృతి చెందడం బాధాకరమన్నారు. కనీసం అక్కడ ఉన్న ఉపాధ్యాయులు గాని ఇన్చార్జులు గాని యాజమాన్యంగానే పట్టించుకోకపోవడం గమనార్హం. విద్యార్థి చనిపోతే కనీసం చూడడానికి రాక ఇలా వ్యవహరించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

విద్యార్థి చనిపోతే కనీసం చూడడానికి రారా
మృతిచెందిన విద్యార్థి బంధువులు

ప్రస్తుతం 10 గంటలకు విద్యార్థి చనిపోతే కనీసం విద్యార్థిని చూడడానికి పాఠశాల అధ్యాపకులు గాని యాజమాన్యం గాని రాకపోవడం సిగ్గుచేటు అన్నారు. పాఠశాలలోనే చదువుతున్నప్పుడు విద్యార్థి చనిపోతే పాఠశాలను బంధు ఉంచకుండా కొనసాగించడం ఏంటని ప్రశ్నించారు. విద్యార్థి ఓ క్రీడాకారుడని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. ఇలా జరగడానికి పాఠశాలలో హాస్టల్లో ఏదో జరిగి ఉంటుందని భావిస్తున్నారు. నోట్లో నుండి చనిపోయాక రక్తం రావడం ఇంకా అనుమానాలు వ్యక్తమయ్యాయి.

కాకతీయ క్యాంపస్ ల వద్ద భారీగా పోలీస్ బందోబస్తు..

9వ తరగతి చదువుతున్న విద్యార్థి శివ జశ్విత్ రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న నాల్గవ టౌన్ పోలీసులు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్, నగర సిఐ శ్రీనివాస్ రాజ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలడి తెలుసుకున్నారు. వెంటనే కాకతీయ క్యాంపస్ చుట్టూ భారీగా పోలీసులను మోహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా బందోబస్తును ఏర్పాటు చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

బందోబస్తు నడుమ పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు

ఎంత చెప్పినా యాజమాన్యం రాకపోయేసరికి పాఠశాలకు వెళ్లి అడిగే ప్రయత్నం కుటుంబ సభ్యులు చేసేందుకు ప్రయత్నించారు. కానీ అక్కడ ఏమి జరిగినా బాధ్యులు మీరే అవుతారు అని సిఐ శ్రీనివాసరాజ్ క్లుప్తంగా వివరించేసరికి వెన్నుతిరి గారు. అక్కడి నుడి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

యాజమాన్యంపై ఫిర్యాదు

తమ బాబు శివ జశ్విత్ రెడ్డి మృతి పై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని, తమ కొడుకు మృతికి కారణమైన యాజమాన్యంపై, సంబంధిత ఇన్చార్జి అధ్యాపక బృందంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు నగర సిఐ శ్రీనివాస్ రాజ్, ఎస్సై శ్రీకాంత్ కు ఫిర్యాదు అందించారు.

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం

నిజామాబాద్ నగర సిఐ శ్రీనివాస్ రాజ్, స్థానిక ఎస్సై శ్రీకాంత్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

సుమారు రెండు గంటలపాటు అక్కడే ఉన్న నిజామాబాద్ జిల్లా ఎస్ ఎఫ్ ఐ నాయకులు విగ్నేష్,అలాగే పటేల్ ప్రసాద్ ఇందుర్ అక్కడికి చేరుకున్నారు. మృతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## 11 రైతు సేవ కేంద్రాల యందు ధాన్యం కొనుగోలు కేంద్రాలు




(కాకుమాను నవంబర్ 29 జనం రిపోర్టర్): మండలం లోని వరి పండించే అన్ని గ్రామాలలో అంటే 11 రైతు సేవ కేంద్రాల యందు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినారు. రైతులు దగ్గర ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని మండల వ్యవసాయ అధికారి రైతులకు తెలియజేయడం జరిగింది . మండల వ్యవసాయ అధికారి కె. కిరణ్మయి రైతులు పండించిన ధాన్యాన్ని పరిశీలించి గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉన్నారనీ ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్ముకోదల్చిన రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి 17 % లోపు తేమ ఉండేటట్లు చూసుకోవాలని తెలియచేశారు.సాధారణ రకము(కామన్) క్వింటా 2300/- రూ , 75 కేజీలకు గాను 1725 రూపాయలు మరియు గ్రేడ్ 'ఎ 'రకము క్వింటా 2320/- , 75 కేజీలకు 1740 రూపాయలు మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది అని రైతులకు తెలియజేశారు.ఒకవేళ ఇంకా 22% తేమ శాతం ఉన్నట్లయితే జెసి కింటాకు 5 కిలోల చొప్పున తగ్గించుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలని తెలియజేయడం జరిగింది. రైతు లకు గోనెసంచులు కానీ హమాలీలు కానీ మరియు రవాణా కానీ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం లెక్కల ప్రకారం ఆ పైకం నేరుగా రైతుల ఖాతాలోకి దాన్యం సొమ్ముతో సహా చెల్లించబడుతుంది అని వివరించారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మండలంలో 4200 కింటాలు కొనుగోలు కేంద్రం వారు ధాన్యాన్ని సేకరించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి కె. కిరణ్మయి తెలియజేయడం జరిగింది.

## మలిదశ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్...!!

**నవాబుపేట్ మండల బిఆర్ఎస్ పార్టీఅధ్యక్షులు అంతనోల్ల దయాకర్ రెడ్డి..!!**



కారాబాద్ జిల్లా ప్రతినిధి: నవాబుపేట్ నవంబర్ 29 (జనం రిపోర్టర్ ): నవాబుపేట్ మండల కేంద్రంలోని మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్షాదివాస్ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అంతాన్నోళ్ల దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మలిదశ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ తెలంగాణ తెచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అని ఆమరణ నిరాహార దీక్షకు దిగి నవంబర్ నెల 29కి సరిగ్గా పదిహేనేండ్లు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది.అందుకని దీక్షాదివస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని అన్నారు.కేసీఆర్ ఆదేశాలతో మండల కేంద్రంలో దీక్షాదివస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది.ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో రాష్ట్రాన్ని సాధించి, సాగునీటి ప్రాజెక్టులను చేపట్టడంతోపాటు ఉద్యోగ నియామకాలు చేపట్టి సబ్బండ వర్ణాల సంక్షేమం నిమిత్తం రైతు బీమా, రైతు బంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేశారని ఆయన గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అన్నింటిలోనూ వైఫల్యం చెందిందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోలీస్.మహేశ్వర్ రెడ్డి,ముఖ్య సలహాదారు విజయ్ కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్స్ గణపురం శాంతకుమార్,పురుషోత్తం,కార్యనిర్వాహక కార్యదర్శి మాణిక్ రెడ్డి,ఉపాధ్యక్షులు దాసు గౌడ్,యూత్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి,ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజు,సోషల్ మీడియా అధ్యక్షులు శేఖర్,బీసీ సెల్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, కోశాధికారి జగన్ రెడ్డి,కార్యదర్శి లోకేష్,ఎస్సీ ప్రధాన కార్యదర్శి సంతోష్,బీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి కావలి అంజి, కావలి రాజు, దేవన్న గారి బుచ్చిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మిల్క్ సంతోష్ కుమార్,ఆయా గ్రామాల అధ్యక్షులు,కార్యదర్శులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అదానీ జగన్ ని కలిస్తే తప్పు.. చంద్రబాబుని కలిస్తే గొప్పా



అమరావతి : వైఎస్ జగన్‌పై గత 15 ఏళ్లగా చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తూనే ఉన్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. సెకీ ఒప్పందం గురించి టీడీపీ గెజిట్ పేపర్లు ఈనాడు ఆంధ్రజ్యోతి అదే పనిగా తప్పుడు రాతలు రాస్తున్నాయని అమర్నాథ్ మండిపడ్డారు. 'విద్యుత్ కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సెకీ మధ్య ఒప్పందం కుదిరింది. కేబినెట్ లో చర్చిన తరువాత సైకీతో ఒప్పందం ప్రభుత్వం చేసుకుంది. సైకీ తో ఒప్పందం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేశాము. ఆ కమిటీ అధ్యయనం చేసిన 45 రోజులు తరువాత ఒప్పదం చేసుకున్నాము. కేంద్ర ప్రభుత్వ సంస్థ సైకీని దళారి సంస్థ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ఎలా రాస్తాయి అని ప్రశ్నించారు? విజనరీ అని చెప్పుకొనే చంద్రబాబు 5 రూపాయలకు యూనిట్ విద్యుత్ కొంటే.. జగన్ 2.49 పైసలకు కొన్నారని, వైఎస్ జగన్ ను అదానీ కలిస్తే తప్పు. అదే చంద్రబాబుని కలిస్తే గొప్పగా చెబుతారు' అని ఆయన వ్యాఖ్యానించారు. సెకీ తో అనేక రాష్ట్రాలు ఒప్పందం చేసుకున్నాయి. అన్ని రాష్ట్రాల కంటే తక్కువ రేటుకు ఒప్పదం చేసుకున్నది మన రాష్ట్రమే. జగన్ చేసుకున్న ఒప్పందం తప్పితే ఆ ఒప్పందం తప్పని రద్దు చేయెుచ్చుగా. రూ.2.49 కంటే తక్కువ రేటుకు ఒప్పందం చేసుకోవచ్చుగా.. 86 వేల కోట్లు బారం వేసిన చంద్రబాబు గొప్పనా. రాష్ట్రానికి లక్ష పది వేల కోట్లు మిగిల్చిన వైఎస్ జగన్ గొప్పనా? ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పారు. ఇప్పుడు 20 వేల కోట్లు బారం ప్రజలపై వేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ను చంద్రబాబు నిలబెట్టుకోవాలి లేకపోతే ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని అమర్నాథ్ వ్యాఖ్యానించారు.

## ప్రజలకు పకోడాలు.. ఎంచుకున్న కొద్దిమందికి హల్వా



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ ప్రభుత్వం ప్రజలకు పకోడాలు.. ఎంచుకున్న కొద్దిమందికి హల్వా అందిస్తుందని కాంగ్రెస్ మండిపడింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) నివేదికపై శుక్రవారం కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ స్పందించారు. ఐఎల్ఒ నివేదికను ఉటంకిస్తూ .. ఇది ప్రధాని మోడీ పకోడా నామిక్స్ ప్రత్యక్ష పరిణామమని ధ్వజమెత్తారు. ఐఎల్ఒ ఇటీవల విడుదల చేసిన ' ప్రపంచ వేతన నివేదిక 2024-2025' భారత దేశంలో వేతన అసమానతలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. భారతదేశంలో ఆదాయం పొందేవారిలో మొదటి 10 శాతం మంది దిగువ 10 శాతం కంటే 6.8 రెట్లు అధికంగా సంపాదిస్తున్నారని అన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ మరియు మయన్మార్‌లతో సహా మన పొరుగున ఉన్న దాదాపు ప్రతి దేశం కన్నా వేతనాలు చాలా అసమానంగా ఉన్నాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. తక్కువ -మధ్య ఆదాయ దేశాలలో వేతన కార్మికులలో భారతదేశం అత్యల్పవాటాను కలిగి ఉందని నివేదికను ఉదహరించారు. చాలా మంది కార్మికులు స్వయం ఉపాధి కలిగి ఉన్నారని, అయితే ఇది అనధికారికంగా, తక్కువ వేతనంతో మరియు ఎక్కువ అస్థిరతకు గురవుతుందని అన్నారు. ఇది నాన్ బయోలాజికల్ పిఎం సృష్టించిన పకోడా -నామిక్స్ ప్రత్యక్ష పరిణామ ఫలితమని ఉద్ఘాటించారు. ప్రజలకు పకోడాలు, ఎంచుకున్న కొద్ది మందికి హల్వా అందిస్తున్నారని మండిపడ్డారు.ు

## తుపానుగా మారనున్న తీవ్ర వాయుగుండం..

### 3 రోజుల పాటు వర్షాలు



అమరావతి : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం శుక్రవారం రాత్రికి తుపానుగా మారనుందని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. గంటకు 8 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ శుక్రవారం అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. తుపాను ప్రభావంతో ఎపిలో 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురవవచ్చని హెచ్చరించింది. శనివారం మధ్యాహ్నం తమిళనాడులోని కారైకాల్ వద్ద తుపాను తీరం దాటుతుందని తెలిపింది. శ్రీలంకలోని ట్రింకోమలీకి ఉత్తర ఈశాన్యదిశగా 270 కి.మీ, నాగపట్నానికి తూర్పుగా 300కి.మీ, పుదుచ్చేరికి తూర్పు ఆగేయంగా 340కి.మీ, చెన్నైకి ఆగేయంగా 380 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపింది. వాయువ్య గా దిశగా కదిలి.. బలపడి రానున్న 6 గంటల్లో తుపానుమారే అవకాశం ఉందని పేర్కొంది. నవంబర్ 30న కారైకాల్ - మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశముందని తెలిపింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 90 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలు వీచే అవకాశం ఉందని పేర్కొంది. మత్స్యకారులను వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.

## మసీదు సర్వేను నిలిపివేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : సంభాల్ మసీదు సర్వేను సుప్రీంకోర్టు శుక్రవారం నిలిపివేసింది. సర్వేకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని ట్రయల్ కోర్టును ఆదేశించింది. షాహి జామా మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించే వరకు కేసును కొనసాగించకుండా ఉండాల్సిందిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. సంభాల్‌లో శాంతి, సామరస్యాలు నెలకొనేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను 2025, జనవరి 6కి వాయిదా వేసింది. పెండింగ్‌లో ఉన్న కేసులో తొందరపాటుతో, ఏకపక్షంగా ట్రయల్ కోర్టు సర్వే ఆదేశాలను జారీ చేసిందని మసీదు కమిటీ వాదించింది. మొఘలుల కాలం నాటి మసీదు ప్రార్థనా స్థలాల చట్టం,1991 ప్రకారం రక్షిత స్థలమని కోర్టుకు తెలిపింది. దీనికి విరుద్ధంగా, హిందూవర్గం ఈ మసీదును 1526లో మొఘల్ చక్రవర్తి బాబర్ హరిహర్ ఆలయాన్ని పడగొట్టి నిర్మించారని ఆరోపించిందని కమిటీ పేర్కొంది. దేవాలయ శిథిలాలపై మసీదును నిర్మించారేమో సర్వే చేపట్టాల్సిందిగా ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మసీదు కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సర్వే సందర్భంగా నెలకొన్న హింసాకాండలో నలుగురు మరణించిన సంగతి తెలిసిందే. హింసాత్మక ఘటనలపై విచారణ జరిపి మరో రెండు నెలల్లో నివేదిక సమర్పించేందుకు అలహాబాద్ హైకోర్టు మాజీ జడ్జి దేవేంద్ర కుమార్ అరోరా నేతృత్వంలో త్రిసభ్య కమిటీని యుపి ప్రభుత్వం నియమించింది. మాజీ ఐపిఎస్ అధికారులు అమిత్ మోహన్ ప్రసాద, అరవింద్ కుమార్ జైన్‌లు ఈ కమిటీలో మిగిలిన ఇద్దరు సభ్యులు.

# డోనాల్డ్ ట్రంప్ ఉడుత ఊపులు!



ఇల్లలకగానే పండగ కాదు. అలాగే వర్తమాన ప్రపంచీకరణ యుగంలో ఎవరైనా ఏకపక్షంగా వ్యవహరిస్తామంటే కుదరదు. దెబ్బకు దెబ్బ తీసే రోజులివి. తాను అధికారానికి వచ్చిన తొలి రోజే చైనా,మెక్సికో,కెనడాల నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై పది, ఇరవై అయిదు శాతాల చొప్పున పన్ను విధిస్తానని రెండోసారి ఎన్నికైన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. తాము కూడా చేయాల్సింది చేస్తామని ఈ దేశాలు ఆ పెద్దమనిషికి స్పష్టం చేశాయి. వైట్‌హౌస్‌లో కొలువు తీరేందుకు ఇంకా యాభై రోజులకు పైగా గడువు ఉంది. ఈ లోగా ఈ మూడు, ఇతర దేశాలను కూడా లొంగదీసుకొని సాధ్యమైనంత మేరకు తమ కార్పొరేట్లకు లబ్ది చేకూర్చాలన్నది ట్రంప్ ఎత్తుగడ. అందువలన అప్పటివరకు ఈ వ్యవ హారంలో దోబూచులాటలు నడుస్తాయి. గత అనుభవాన్ని బట్టి ఎవరూ తెగేదాగా లాగే అవకాశం లేదు. ఈలోగా ఎవరి తురుపు ముక్కలను వారు ప్రయోగిస్తారు. విదేశాల మీద నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై ఏ దేశమైనా సుంకం విధిస్తే ఆ మేరకు తమ వినియోగదారులపై భారాలు మోపాలి లేదా జనం నుంచి వ్యతిరేకత వస్తుందనుకుంటే ఆ మేరకు ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుంది. 2023 సంవత్సర వివరాలను పరిశీలించినపుడు చైనా, మెక్సికో, కెనడాల నుంచి అమెరికా దిగుమతి చేసుకున్న వస్తువుల విలువ 1.2లక్షల కోట్ల డాలర్లుగా తేలింది. ఈ మొత్తంలో చైనా నుంచి 60శాతం ఉంది.ట్రంప్ చెప్పినట్లుగా పన్ను విధిస్తే అమెరికాలోని ప్రతి కుటుంబం మీద 1,900 నుంచి 7,600 డాలర్ల వరకు భారం పడుతుంది. పర్యవ సానంగా 1.4 నుంచి 5.1శాతం వరకు ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. తాము దిగుమతి చేసుకున్న వస్తువుల ధరలు పెరిగితే అంతిమంగా జనం నుంచే వసూలు చేస్తామని ఇప్పటికే వాల్‌మార్ట్ వంటి బడాసంస్థలన్నీ ప్రకటించాయి. మంచి తరుణం మించిపోతుంది, పాత స్టాకు ధర ఇది పన్ను పెరిగితే ఇంత అంటూ ఇప్పటికే అనేక సంస్థలు వినియోగ దార్లను ఊరిస్తున్నాయి. చైనా నుంచి దిగుమతి చేసుకొనే ఎలక్ట్రానిక్ వస్తువు ధరలు పెద్ద మొత్తంలో పెరుగుతాయి. ట్రంప్ తొలిసారి అధికారంలో ఉన్నపుడు ప్రారంభించిన వాణిజ్య యుద్ధం విధించిన పన్నులు వినియోగదారుల మీద పెద్దగా ప్రభావం చూపలేదు గానీ, ఈ సారి అలా ఉండదని అంటున్నారు. చైనా నుంచి వినియోగ వస్తువులను ఎక్కువగా దిగుమతి చేసుకుంటుండగా మెక్సికో, కెనడాల నుంచి ఇంధనం సింహ భాగం ఉంది.దాని ధరలు పెరగటం అనివార్యం. అమెరికా దిగుమతి చేసుకొనే మొత్తం ఇంధన దిగుమతుల్లో కెనడా, మెక్సికోల నుంచి నాలుగో వంతు, ఖాద్యతైలాల్లో కెనడా నుంచి సగం ఉంది. వ్యవసాయ, గొడ్డుమాంస ఉత్పత్తులను, పొటాష్ ఎరువును కూడా ఈ రెండు దేశాల నుంచి అమెరికా పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంటున్నది. అమెరికాలో విక్రయించే వంద చెప్పుల జతల్లో 99 విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నవే, ఒక్క చైనా నుంచే 56శాతం ఉన్నాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై విధించే పన్నుతో కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలను అమలు జరపవచ్చని, స్వదేశంలో ఉత్పత్తి పెంచటం ద్వారా ఉద్యోగ రక్షణ, కొత్త ఉపాధి కల్పించవచ్చని గతంలో ట్రంప్ అండ్ కో చెప్పిన కబుర్లకు ఎలాంటి విశ్వసనీయ ఆధారాలు లేవు. 'తాటి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడగడ్డి ఎక్కడుందో చూద్దామన్నట్టుగా' దిగుమతి పన్ను విధించేందుకు ట్రంప్ చెప్పిన సాకులు తర్కానికి నిలిచేవి కాదు. మెక్సికో నుంచి అక్రమంగా వలసలు వస్తున్నారంటూ గతంలో ఆ దేశ సరిహద్దులో గోడ నిర్మించినప్పటికీ వలసలు ఆగలేదు, చైనా నుంచి మత్తుపదార్థాలు దిగుమతి అవుతున్నట్లు ఆరోపించాడు. ప్రపంచంలో ఏ దేశానికీ లేని నిఘా వ్యవస్థ ఉన్న అమెరికా అధినేత ఇలా మాట్లాడటం కుంటిసాకు, అమెరికన్లను వంచించటం తప్ప మరొకటి కాదు. పన్ను ప్రకటన తరువాత మెక్సికో, కెనడా అధినేతలతో ట్రంప్ ఫోన్ సంభాషణలు చేయటం బెదిరింపు-బుజ్జగింపు వ్యవహారం తప్ప మరొకటి కాదు. వాణిజ్య యుద్ధం ఎవరికీ మంచిది కాదు, తమ మంచితనాన్ని అలుసుగా తీసుకుంటే అనుభవిస్తారంటూ చైనా హెచ్చరించింది. గతంలో తమ వస్తువులపై విధించిన పన్నుకు ప్రతిగా అమెరికా ఎగుమతి చేసే సోయా, ఇతర వ్యవసాయ ఉత్పత్తులపై చైనా కూడా ప్రతి చర్యలు తీసుకుంది. ట్రంప్ పోయి బైడెన్, తిరిగి ట్రంప్ రాకతో తన ఎగుమతులకు ప్రత్యామ్నాయ మార్కెట్లను చూసుకుంటున్నది. అందువలన తన ఉడుత ఊపులకు బెదిరే దేశాలేవీ లేవన్నది ట్రంప్ ఎంతగా గ్రహిస్తే అన్ని దేశాలకూ అంతమంచిది.

# అడవి ఎదపై 'యురేనియం' పిడుగు



"వ్యవసాయం, తోటలు, నదులు, అడవులు, చెట్లు, సముద్రాలు, భూగర్భజలాలు, ఖనిజాలు అన్ని కొల్ల గొట్టడానికి పాలకులు వాడుతున్న పదం అభివృద్ధి. పాలకులు అభివృద్ధి అన్నారంటే అది విధ్వంసం అని ప్రజలు గ్రహించాలి". - మేధా పాట్కర్ తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ ఐటిడిఏ పరిధిలోని అమ్రాబాద్ అటవీ ప్రాంతం, ఏపీలోని కర్నూలు జిల్లా దేవరకొండ మండలం కప్పట్రాళ్ల ఫారెస్టు భూమిలో అణుకుంపటి రాజుకుంటోంది. ఇక్కడ యురేని యం తవ్వొద్దంటూ ప్రభావిత గ్రామాల ప్రజలు కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో కొవ్వాడ, రాయల సీమలో కడప జిల్లా తుమ్మలపల్లి, ఇలా వివిధ ప్రాంతాల్లోని యురేనియం నిక్షేపాలు తెలుగు రాష్ట్రాల ప్రజలకు శాపంగా మారుతున్నాయి. కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టు పరిధిలో యురేనియం కోసం అరవైఎనిమిది బోర్ల తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. అలాగే తెలంగాణలో బీఆర్ఎస్ హయాంలో నల్లమల అడవిలో కేంద్ర బృందం జట్ విమానంతో సర్వే చేపట్టింది.యురేనియం పరీక్షలు నిర్వహించింది. చెంచులు, ఆదివాసులు నివసిస్తున్న గూడేలను ఖాళీ చేయించే ప్రయత్నం చేసింది. దీంతో ఫారెస్టు అధికార యంత్రాంగం దూకుడుగా వ్యవహరించింది. ప్రజలు ముంచుకొస్తున్న ముప్పును గ్రహించి ఉద్యమించడంతో కాస్తా వెనక్కితగ్గింది. ప్రజల ప్రయోజనాలకు అణువంత కూడా ఉపయోగపడని యురేనియానికి దేశ పాలకులు ఎందుకు అను మతులిస్తున్నట్టు? పచ్చని అడవుల్లో ఎందుకీ విధ్వంసం? అంటే ఏలికల దగ్గర ఎలాంటి సమాధానం లేకపోవచ్చు. కానీ, మనకు తెలియాల్సింది ఏమిటంటే ఇది కార్పొరేట్లకు దోచిపెట్టే పన్నాగం! రాయలసీమలో యురేనియం నిక్షేపాలను దశాబ్దాల కిందటే గుర్తించారు. 2007 ప్రాంతంలో తవ్వకాలకు సన్నాహాలు జరిగాయి.అక్కడి ప్రజలు మైనింగును వ్యతిరేకిస్తూ ఉద్యమించారు. కడప బేసిన్ కప్పట్రాళ్లలో 2017లో డ్రిల్లింగ్ చేసి యురేనియం నిక్షేపాలను గుర్తిం చారు. తాజాగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ ప్రాంతంలో పన్నెండు వందల ఎకరాల అటవీ భూమిలో తవ్వ కాలకు కార్పోరేట్లకు అనుమతులిచ్చింది. యురేనియం వెలికితీత మొదలైతే అడవి నాశ నమై పోతుంది. చుట్టు పక్కల పచ్చని పొలాలు బీళ్లుగా మారతాయి. తోటలు, పర్యావరణం దెబ్బతింటాయి. ప్రభావిత గ్రామాల ప్రజలు క్యాన్సర్ వంటి భయానక రోగాల బారిన పడతారు. పీల్చుకోవడానికి స్వచ్ఛమైన గాలి కూడా లభించదు. హంద్రీ- నీవా, కృష్ణా, తుంగభద్ర సహా అన్ని నీటి వనరులు కాలుష్యమయమవుతాయి.తాగే నీటిలో యురేనియం పాళ్లు అధికమై క్యాన్సర్, కిడ్నీ, చర్మ, ఊపిరితిత్తుల వ్యాధులు ప్రబలుతాయి. ఇప్పటికే భారత్ తీవ్రమైన, జీవ వైవిధ్య సమస్యను ఎదుర్కొంటోంది. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ సూచీల భారత్ 180 దేశాలలో 176వ స్థానంలో అట్టడుగున ఉంది. భూమి నిర్వహణ, జీవ వైవిధ్యం, పర్యావరణం వంటి అంశాలు సూచికగా తీసుకుంటే మనం చివరెక్కడో ఉన్నాం. దేశంలో 2001 నుంచి 2019 మధ్య కొనసాగుతున్న అటవీ నిర్మూలన కారణంగా 23,300 చదరపు కిలోమీటర్ల అడవిని ఇప్పటికే కోల్పోయాం. ఈ స్థితిలో యురేనియం తవ్వకాలు 'గోరుచుట్టుపై రోకటి పోటు' అన్న చందంగా మారాయి. ప్రకృతికి పెట్టుబడి, సామ్రాజ్యవాదం ప్రధాన శత్రువులై హాని తలపెడుతుంటే పర్యావరణ సమతుల్యం దెబ్బతిని ప్రకృతి ప్రకోపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా మానవ తప్పిదాల వలన అనేక ప్రకృతి విపత్తులతో ఎంతో ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లుతోంది. మనదగ్గర ఉత్తరాఖండ్‌లో కొండ చరియలు విరగడం, అనేక రాష్ట్రాల్లో వర్షాలు బీభత్సం సృష్టించడం ఈకోవకు చెందినవే. గత చరిత్ర నుంచి గుణ పాఠాలు, నేర్వని ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. అభివృద్ధి పేరుతో పర్యావరణ హననానికి పాటుపడుతున్నాయి. 2011లో జపాన్‌లోని 'ఫుకుషిమా' అణు రియాక్టర్ సునామి దెబ్బకి ధ్వంసం కాగా లక్షలాది మంది పౌరులు అసువులు బాశారు. ఎంతోమంది క్షతగాత్రులయ్యారు. ఈ అనుభవాల నుంచి జపాన్, రష్యా, ఫ్రాన్స్ వంటి దేశాలు అణు రియాక్టర్లను పూర్తిగా మూసివేశాయి. ఈ సామ్రాజ్యవాద దేశాలు మన పాలకుల మెతక వైఖరి కారణంగా భారత్ వంటి దేశాలకు అణు ప్రాజెక్టులకు తరలిస్తున్నాయి. ఎన్డీయే సర్కార్‌కు ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో ఎలాగూ పనిలేదు. కార్పోరేట్ల లాభాలే లక్ష్యంగా పని చేస్తోంది. యురేనియం అణుధార్మికత చాలా ప్రమాదమని, అధికఖర్చని తెలిసినా అమెరికా ఒత్తిడితో కేంద్రం అను మతులివ్వడం ప్రజల ఆరోగ్యం పట్ల ఉన్న నిరక్ష్యాన్ని తెలియజేస్తోంది. యురేనియం శుద్ధి వల్ల విషవాయువులు వెలు వడుతాయి. అది భూమిలో నుండి బయటికి రాగానే గాలిలోని ఆక్సిజన్‌తో చర్య జరుపుతుంది. అణుధార్మికతతో విషం కక్కుతుంది.గాలిలో ప్రవేశించిన తరువాత మనుషుల, జంతువుల శరీరాలల్లోకి ప్రవేశించి ఎముకల్లో స్థిరపడు తుంది. దీంతో చాలా సులభంగా క్యాన్సర్ వివిధ రకాల చర్మవ్యాధులు వ్యాపిస్తాయి. కొన్ని వందల ఏండ్ల పాటు అవ యవాల లోపంతో వికృత సంతానం కలుగుతుంది. దీర్ఘకాలం సంతానలేమి కూడా ఉండవచ్చు. పురుషుల్లో శుక్రకణాల ఉత్పత్తి వేగం తగ్గుతుంది. స్త్రీలల్లో అండాల విడుదల క్రమం దెబ్బతింటుంది. గర్భాశయ క్యాన్సర్లు వస్తాయి. గాలి, నీరు కలుషితమై మనుషులు చనిపోతారు. జంతువులు, పక్షులు కూడా మృత్యువాతపడతాయి. పంట పొలాల్లో విత్తనాలు వేసినా మొలకెత్తవు. మొలకెత్తినా ఎదుగుదల ఉండదు. మొత్తం ఆ ప్రాంతం భూమి విషతుల్యమై, నిస్సారమైపోతుంది.ఇది యురేనియం తవ్వకాలతో ఏర్పడబోయే ముప్పును ముందే గ్రహించి తేల్చారు శాస్త్రవేత్తలు. యురేనియం నిక్షేపాలున్న చోట టైగర్‌జోన్ పేరుతో తరతరాలుగా అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీ, గిరిజనులను అడవి నుంచి పంపే ప్రయత్నాలు చేస్తోంది కేంద్రం.కప్పట్రాళ్లలో పన్నెండు గ్రామాలు, నల్లమలలో ఎనిమిది గ్రామాలు యురేనియం ప్రభావానికి గురవుతన్నాయి. మైదాన ప్రాంతాల్లో జీవించలేని ఆది వాసులకు ఇదో జీవన్మరణ సమస్య. ఈ నేపథ్యంలో వారి మనుగడే ఓ ప్రశ్నార్థకంగా మారింది. ప్రజల ఆరోగ్యాల్ని ఫణంగా పెట్టి, వారికి హాని తలపెడుతున్న దేశ రాజకీయ వ్యవస్థను సమూలంగా మార్చుకుంటే తప్ప మనకు భవి ష్యత్తు లేదన్న అంశాన్ని పౌర సమాజం గుర్తెరగాలి. ప్రత్యామ్నాయ వామపక్ష సోషలిస్టు రాజకీయాల ద్వారా వ్యక్తిగత ఆస్తికి తావులేని సమ సమాజాన్ని నిర్మించుకోవాలి.ఈ ప్రకృతి అనగా ఈ నేల, ఈ గాలి, ఈ అటవీ సంపద, మొత్తంగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. ఇంతటి వినాశకారకమైన యురేనియం వెలికితీత తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశంలో ఎక్కడ చేపట్టినా ప్రజలు వ్యతిరేకించాలి, ఉద్యమించాలి, తిరుగుబాటు ద్వారా వెనక్కి తిప్పికొట్టాలి. లేదంటే మనం, మన భావితరం తగిన మూల్యం చెల్లించక తప్పదు.

# ఏఐ టూల్స్ ఉపయోగం ఇలా..




హైదరాబాద్: న్యాయవ్యవస్థ కార్యకలాపాల్లో దోహదపడేందుకు వీలుగా తాజాగా అందుబాటులోకి వచ్చిన మూడు కృత్రిమ మేథ (ఏఐ) టూల్స్ శ్రుతి, సారాంశ్, పాణిని ఎలా పనిచేస్తాయి.. కోర్టు సిబ్బందికి అవి ఎలా సహాయపడతాయి? వాటి వివరాలు ఇలా..

### ఏఐ శ్రుతి...

ఆటోమేటిక్ స్పీచ్ రికగ్నిషన్ (ఏఎస్ఆర్) అంటే.. మనం మాట్లాడే పదాలను రాతపూర్వకంగా మార్చే టూల్. స్టెనోగ్రాఫర్ల లోటును ఇది భర్తీ చేస్తుంది. దీని సాయంతో న్యాయమూర్తులు చెప్పే మధ్యంతర ఉత్తర్వులు, తీర్పులను నేరుగా రాతపూర్వక రూపంలోకి మార్చుకోవచ్చు.

### పదాలు సరిగా వచ్చాయా లేదా..

అని సరి చూసుకొనే అవకాశం కూడా ఇందులో ఉంది. కోర్టు సిబ్బందికి ఇది శ్రమను తగ్గిస్తుంది. దీన్ని స్పీచ్ టు టెక్స్‌ట్ అని కూడా అంటారు. ఆంగ్లంలోనే కాదు.. తెలుగు, హిందీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, తమిళం, కన్నడ భాషల్లోనూ దీన్ని వినియోగించుకోవచ్చు. ఈ టెక్స్‌ట్‌ను పీడీఎఫ్ ఫార్మాట్‌లో కాపీని పొందవచ్చు.

### సారాంశ్...

ఇది పూర్తి సుదీర్ఘ కంటెంట్‌లోని ప్రధాన అంశాలను అందిస్తుంది. పేజీలకు పేజీల తీర్పుల్లోని సారాంశం కావాలనుకున్నప్పుడు ఈ టూల్ ఉపయోగపడుతుంది. కచ్చితమైన సారాంశాన్ని రూపొందించమే ఈ సారాంశ్ పని.

### పాణిని...

ఇది ఒక ట్రాన్స్‌లేటర్‌లా పనిచేస్తుంది. కోర్టుకు సంబంధించిన వివిధ డాక్యుమెంట్లను ఆంగ్లం నుంచి తెలుగులోకి మార్చుకోవచ్చు. ఆంగ్లం నుంచి దేశంలోని పలు భాషల్లోకి.. ఇటు నుంచి అటు మార్చుకోవచ్చు.

11 భాషల్లోకి అనువాదం చేయగల టూల్ ఈ పాణిని. తెలుగుతోపాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒరియా, పంజాబీ, తమిళంలోకి అనువదించగలదు.

### ఈ-సేవలో కక్షిదారులకు అందే సేవలు..

' కేసు స్థితి, తదుపరి విచారణ తేదీ, ఇతర విచారణ వివరాలు కావాల్సిన డాక్యుమెంట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు హార్డ్ కాపీ పిటిషన్లను స్కాన్నింగ్ మొదలు ఈ-సంతకం చేర్చడం, సీఐఎస్ వరకు అప్‌లోడ్ చేసి ఎస్ఆర్ నంబర్ సృష్టించడం ఈ-స్టాంప్ పేపర్ల కొనుగోలు/-చెల్లింపులు ఆన్‌లైన్‌లో చేయడానికి సాయం జైలులోని బంధువులను కలుసుకోవడానికి ఈ-ములాఖత్ కోసం బుకింగ్ సదుపాయం'న్యాయమూర్తులు సెలవులో ఉంటే వివరాలు తెలుసుకోవచ్చు సుప్రీంకోర్టు నుంచి స్థానిక కోర్టుల వరకు న్యాయ సహాయ కమిటీల నుంచి ఉచిత న్యాయసేవను ఎలా పొందవచ్చో తెలుసుకోవచ్చు తీర్పులు, మధ్యంతర ఉత్తర్వుల కాపీలను ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా పొందవచ్చు

## ఐరాస శాంతి పరిరక్షక కమిషన్‌కి తిరిగి ఎంపికైన భారత్



న్యూఢిల్లీ : భారత్ 2025-26 సంవత్సరానికి ఐరాస శాంతి పరిరక్షక కమిషన్ (పిబిసి)కి తిరిగి ఎన్నికైంది. కమిషన్‌లో భారత దేశ ప్రస్తుత పదవీకాలం డిసెంబర్ 31తో ముగుస్తుంది. "భారత్ 2025-26 సంవత్సరానికి యుఎన్ శాంతి పరిరక్షక కమిషన్‌కు తిరిగి ఎంపికైంది. పిబిసి వ్యవస్థాపక సభ్యులిగా, ప్రధాన సహకారిగా, ప్రపంచ శాంతి మరియు స్థిరత్వం కోసం పనిచేయడానికి పిబిసితో తమ సహకారాన్ని కొనసాగించడానికి భారత్ కట్టుబడి ఉంది" అని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత కమిషన్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. పిబిసి సాధారణ అసెంబ్లీ, భద్రతా మండలి మరియు ఆర్థిక, సామాజిక మండలి నుండి ఎన్నికైన 31 సభ్యదేశాలను కలిగి ఉంటుంది. ఐరాసలో ఆర్థికసహకారం అందించే దేశాలు, అగ్రదళం, సహకార దేశాలు కూడా సభ్యులుగా ఉంటాయి. యుఎన్ శాంతి పరిరక్షణకు అత్యధిక సిబ్బందిని అందించిన దేశాలలో భారత్ కూడా ఒకటి. ఇది ప్రస్తుతం అబై, సెంట్రల్ అమెరికన్ రిపబ్లిక్, సైప్రస్, డెమోక్రటిక్ రిపబ్లికన ఆఫ్ కాంగో, లెబనాన్ మిడిల్ ఈస్ట్, సోమాలియా, సౌత్ సూడాన్, వెస్ట్రన్ సహారాలో యుఎన్ కార్యకలాపాలకు సుమారు ఆరువేల మంది సైనిక, పోలీస్ సిబ్బందిని మోహరించింది. సుమారు 180మంది శాంతి పరిరక్షకులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. పిబిసి సంఘర్షణ ప్రభావిత దేశాలలో శాంతి ప్రయత్నాలకు మద్దతు ఇచ్చే అంతర ప్రభుత్వం సలహా సంస్థ. విస్తృత శాంతి అజెండాలో అంతర్జాతీయ సంఘం సామర్థ్యానికి కీలకంగా, అదనంగా పనిచేస్తుంది.

## ప్రారంభమైన కొద్ది సేపటికే ఉభయ సభలు వాయిదా



న్యూఢిల్లీ : పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఐదవ రోజైన శుక్రవారం ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే వాయిదా పడ్డాయి. లోక్‌సభ మధ్యాహ్నం 12.00 గంటల వరకు వాయిదా పడగా, రాజ్యసభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. రాజ్యసభ ఉదయం 11.00 గంటలకు ప్రారంభం కాగానే నిమిషాల వ్యవధిలో వాయిదా పడింది. అదానీ స్కాం, మణిపూర్, సంభాల్ హింసాకాండ, బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ పూజారి అరెస్టుపై చర్చ జరపాలని కోరుతూ ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన 17 నోటీసులను చైర్మన్ తిరస్కరించారు. అనంతరం సభను (డిసెంబర్ 2) సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రకటించారు. లోక్‌సభలో అదానీ స్కాంపై చర్చ జరపాలంటూ కాంగ్రెస్ ఎంపి మాణికం ఠాగూర్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అదానీ సమస్య "ప్రజా ప్రాముఖ్యత", మరియు "భారత పాలన, నియంత్రణ చట్టాలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది'' అని తీర్మానంలో పేర్కొన్నారు. సభను స్పీకర్ మధ్యాహ్నం 12.00 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## బీజేపీ హైకమాండ్ నిర్ణయంతో అలిగిన షిండే?..

### కీలక సమావేశం రద్దు



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన మహాయుతి కూటమికి..ప్రభుత్వ ఏర్పాటులో మాత్రం అడుగులు వెనక్కి పడుతున్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో భాగంగా శుక్రవారం ముంబైలో జరగాల్సిన ఎన్డీయే కూటమి కీలక సమావేశం రద్దైంది. రాష్ట్ర అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేడు సతారాలోని తన గ్రామానికి వెళ్లడంతో ఈ భేటీ రద్దైంది. ఆయన తిరిగొచ్చాక సమావేశం జరిగే అవకాశం ఉంది. ఇక ఈ సమావేశంలో తదుపరి సీఎం అంశంపై కూటమి నేతలు చర్చించనున్నారు. అయితే ఇలా ఉన్నట్టుండి షిండే ఆకస్మిక ప్రణాళికతో ప్రభుత్వ ఏర్పాటు చర్చలపై ఆయన అసంతృప్తితో ఉన్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. కూటమిలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవులపై ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ.. కొన్ని మంత్రి పదవుల కేటాయింపు విషయంలో మిత్రపక్షాల మధ్య ఇంకా స్పష్టత రానట్లు సమాచారం. గతంలో మాదిరి ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉండనున్నట్లు తెలుస్తోంది. సీఎంగా దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్, షిండేలు డిప్యూటీలుగా పదవులు చేపట్టడం దాదాపు ఖరారు అయినట్లే కనిపిస్తుంది. కానీ షిండే డిప్యూటీ పదవిపై సంతృప్తి చెందనట్లు సమాచారం. ఈ విషయంపై ఎమ్మెల్యే, శివసేన అధికార ప్రతినిధి సంజయ్ శిర్సత్ మాట్లాడుతూ..' షిండేకు ఉప ముఖ్యమంత్రి పదవి తగదు. ఇదివరకే ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి అది సరికాదు' అని అన్నారు. ఇక కేబినెట్‌లో బీజేపీకి 22 బెర్త్‌లు, శివసేనకు 12, ఎన్‌సీపీకి 9 పోర్ట్‌ఫోలియోలు దక్కే అవకాశం ఉంది. కీలక హోంశాఖను బీజేపీ తన వద్దే ఉంచుకోనున్నట్లు తెలుస్తోంది. షిండేకు చెందిన శివసేనకు పట్టణాభివృద్ధి, ప్రజాపనుల శాఖలు.. ఎన్సీపీకి ఆర్థిక శాఖను కేటాయించే ఛాన్స్ ఉంది. డిసెంబరు 2న ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. కాగా ప్రభుత్వ ఏర్పాటు, కేబినెట్, సీఎం పదవిపై చర్చించేందుకు మూడు పార్టీలకు చెందిన నేతలు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే గురువారం సాయంత్రం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయిన సంగతి తెలిసిందే. అనంతరం షిండే మాట్లాడుతూ.. కేంద్రమంత్రితో చర్చలు సానుకూలంగా జరిగినట్లు పేర్కొన్నారు., మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిపై రాష్ట్ర రాజధానిలో జరిగే మహాయుతి కూటమి మరో సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు తాను అడ్డంకి కానని, ప్రధాని నరేంద్ర మోదీ, షా తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటానని ఆయన విలేకరులతో అన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 288 మంది సభ్యుల సభలో 230 సీట్లను గెలుచుకున్న బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. బీజేపీ 132 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోగా, శివసేన 57, అజిత్ పవార్‌కు చెందిన ఎన్‌సీపీ 41 స్థానాలు గెలుచుకున్నాయి.ং

## మూడో వ్యక్తి కంప్లయింట్ చేస్తే కేసు పెడతారా?

అమరావతి, : ఏపీ హైకోర్టులో సజ్జల భార్గవ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఇవాళ(శుక్రవారం) విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఇది అసలు విచారణ అర్హత లేని కేసంటూ కోర్టు దృష్టికి తీసుకెళ్లారాయన. ఈ కేసులకు అసలు విచారణ అర్హత లేదు. ఎవరు పైన అయితే పోస్ట్ పెట్టారో వాళ్లు కంప్లైంట్ చేయలేదు. ఎవరో మూడో వ్యక్తి కంప్లైంట్ చేస్తే కేసు నమోదు చేశారు. ఈ పోస్టులపై ఐటీ సెక్షన్స్ బదులుగా.. పోలీసులు నాన్‌బెయిలబుల్ సెక్షన్స్ పెట్టారు. ఇది ఆర్గనైజర్ క్రైమ్ అని పోలీసులు చెప్తున్నారు. కానీ, ముమ్మాటికి ఇది అలాంటి నేరమేం కాదు అని పొన్నవోలు వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. తదుపరి విచారణను వచ్చేనెల 6వ తేదీకి వాయిదా వేసింది. అప్పటిదాకా అప్పటివరకు ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవద్దన్న ఆదేశాలను పొడిగిస్తున్నట్లు తెలిపింది. ఇక.. సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీందర్ రెడ్డి హెబియస్ కార్పస్ పిటిషన్ పై విచారణను వచ్చే నెల మూడో తేదీకి వాయిదా వేసింది కోర్టు. మరోవైపు.. బాపట్ల కోర్టులో వర్రా రవీందర్ రెడ్డిని మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. 'ఏ కేసులో మిమ్మల్ని అరెస్టు చేశారో తెలుసా?" అని రవీందర్ రెడ్డిని మేజిస్ట్రేట్ ప్రశ్నించారు. అయితే.. కేసుకు సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్లు తనకు ఇవ్వలేదని రవీందర్‌రెడ్డి చెప్పారు. దీంతో.. పోలీసులను న్యాయమూర్తి మందలించారు. అలాగే.. వర్రాకు వచ్చే నెల 13వ తేదీదాకా రిమాండ్ విధించారు.

# నింగిలోకి కృత్రిమమేధ ప్రయోగశాల

### సంసిద్ధమైన హైదరాబాద్‌లోని అంతరిక్ష రంగ సంస్థ పీఎస్ఎల్‌వీ-ఎక్సెల్ నౌకలో నింగిలోకి దూసుకెళ్లనున్న ల్యాబొరేటరీ ఏర్పాట్లు చేస్తున్న ఇస్రో



పలు విజయవంతమైన ప్రయోగాలతో అంతరిక్షరంగంలో తనదైన ముద్ర వేసిన భారత్ మరో ఘనత సాధించేందుకు సిద్ధమవుతోంది. ఈ సాహసోపేత కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అంతరిక్షరంగ సంస్థ కీలక భాగస్వామిగా ఉండటం విశేషం. భారత్‌లో తయారుచేసిన కృత్రిమమేధ పరిశోధనశాలను అంతరిక్షంలోకి ప్రయోగించనున్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టేక్‌మీటూస్పేస్ సంస్థ తయారుచేసిన 'మై ఆర్బిటార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టెక్నాలజీ డెమోన్‌స్ట్రేటర్ (ఎంఓఐ-టీడీ)' ల్యాబ్‌ను నింగిలోకి పంపనున్నారు. పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా ఈ కృత్రిమమేధ ల్యాబ్‌ను ప్రయోగిస్తున్నారు. వాస్తవానికి ఇది ఉపగ్రహం అయినప్పటికీ పూర్తిస్థాయి పరిశోధనశాలలాగా పనిచేయగల సత్తా దీని సొంతం. అందుకే అంతరిక్షంలో పనిచేయనున్న భారత మొట్టమొదటి కృత్రిమమేధ ల్యాబ్‌గా ఇది చరిత్ర సృష్టించనుంది. డిసెంబర్ నాలుగో తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న ప్రయోగకేంద్రం నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగిస్తారు. కక్ష్యలో తిరుగుతూ ఎప్పటికప్పుడు డేటాను ప్రాసెసింగ్ చేయడం ద్వారా అంతరిక్ష పరిశోధనలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చే ఉద్దేశంతో ఏఐ ల్యాబ్‌ను పంపుతున్నారు. ప్రైవేట్, విదేశీ ఉపగ్రహాల ప్రయోగ బాధ్యతలను చూసుకునే భారత ప్రభుత్వ మరో విభాగమైన 'ఇన్-స్పేస్' వారి టెక్నాలజీ సెంటర్ నుంచి ఎంఓఐ-టీడీకి కీలకమైన సాయం అందింది. అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేసే ఇన్-స్పేస్ సంస్థ ఎంఓఐ-టీడీ టెస్టింగ్ తదితర బాధ్యతలను చూసుకుంది. అత్యంత భారీ డేటాను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేసి భూమి మీదకు పంపడం ఉపగ్రహ కార్యక్రమాల్లో పెద్ద సవాల్‌తో కూడిన వ్యవహారం. ప్రస్తుతం ఏదైనా శాటిలైట్ గరిష్టంగా రోజుకు 1 పెటాబైట్ డేటాను మాత్రమే సంగ్రహించగలదు. ప్రస్తుతం 'క్లౌడ్ కవర్' దృగ్విషయం కారణంగా 40 శాతం ఉపగ్రహ సమాచారం నిరుపయోగం అవుతోంది. వచ్చిన డేటాను ప్రాసెస్ చేయడానికి వారాల తరబడి వేచి ఉండక తప్పని పరిస్థితి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఏఐ ల్యాబ్‌ను రంగంలోకి దించారు. అత్యంత వేగంగా డేటా ప్రాసెసింగ్‌కు ఈ ఏఐ ల్యాబ్ సుసాధ్యం చేయనుంది.

### అంతరిక్ష డేటా సెంటర్ల ఏర్పాటుకు..

రియాక్షన్ వీల్స్, మ్యాగ్నటార్కర్స్, ఏఐ యాక్సిలిరేటర్లు, అత్యాధునిక కంట్రోల్ సిస్టమ్‌తో ఏఐ ల్యాబ్‌ను అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దారు. ఏఐ ల్యాబ్ త్వరగా 'కౌడ్ డేటా' వంటి అంతరిక్ష డేటా సెంటర్ల ఏర్పాటుకూ బాటలువేయనుంది. ఎర్త్ అబ్జర్వేషన్ సామర్థ్యాలను ద్విగుణీకృతం చేయడమేకాకుండా అంతరిక్ష ఆధారిత కంప్యూటింగ్ టెక్నాలజీల అభివృద్ధికి ఇదొక వేదికగా అక్కరకు రానుంది. ల్యాబ్‌కు అదనంగా సౌర ఫలకాలను అమర్చారు. ఇవి భవిష్యత్తులో దీనికి అనుసంధానంగా రాబోయే శాటిలైట్ల ఇంధన అవసరాలను తీర్చగలవు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రోబా-3 మిషన్‌లో భాగంగా డిసెంబర్‌లో ప్రయోగించే పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్‌లోనే ఏఐ ల్యాబ్‌నూ అమర్చుతున్నారు.

### ఎన్నెన్నో ఉపయోగాలు

అక్కడి శాటిలైట్లు సేకరించే సమాచారాన్ని ఈ ఏఐ ల్యాబ్ వేగంగా ప్రాసెస్‌చేసి సంబంధిత యూజర్లకు అనువుగా అందిస్తుంది. దీంతో పర్యావరణంపై పర్యవేక్షణ తో పాటు అడవుల నరికివేత, హరితఉద్గారాల పరిమాణం తదితర ఎన్నో అంశాలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు పొందొచ్చు. దీంతో భిన్న రంగాలకు సంబంధించిన పరిశోధకులు తమకు కావాల్సిన సమాచారాన్ని ఆర్బిట్‌ల్యాబ్ నుంచి నేరుగా సంప్రతింపులు జరిపి పొందొచ్చు. వేర్వేరు అప్లికేషన్లకు సంబంధించిన కృత్రిమమేధ మాడ్యూళ్లను అప్‌లోడ్ చేసి ఈ వెబ్ ఆధారిత కన్‌సోల్‌తో అనుసంధానం కావచ్చు. ఇప్పటికే మలేసియా విశ్వవిద్యాలయంతోపాటు భారతీయ విద్యార్థుల బృందమొకటి ఇందుకోసం తమ పేర్లను నమోదుచేసుకుంది. ఎక్కువ మంది యూజర్లు పెరిగేకొద్దీ ఆయా పరిశోధకులయ్యే ఖర్చు సైతం భారీగా తగ్గనుంది.

# కోర్టులు కదిపిన తేనెతుట్టెలు



దేవుడు అంతటా, అందరిలో ఉన్నాడని నమ్మే గడ్డపై... ఆయనను నిర్ణీత స్థల, కాలాలకే పరిమితం చేసే సంకుచిత రాజకీయ స్వార్థాలు చిచ్చు రేపుతూనే ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య విద్వేషాగ్ని రగిలిస్తున్న ఈ ప్రయత్నాలకు తాజా ఉదాహరణ - యూపీలోని సంభల్ జామా మసీదు వివాదం, దరిమిలా అక్కడ రేగిన హింసాకాండ, ఆస్తి, ప్రాణనష్టం. ఈ ఏడాది జనవరిలో జరిగిన అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపనతో మందిరం - మసీదు వివాదాలు ముగిసిపోతాయని ఎవరైనా ఆశపడితే అది వట్టి అడియాసని మరోసారి తేలిపోయింది. మత రాజకీయాలకూ, వర్గ విభేదాలకూ ప్రార్థనా స్థలాలు కేంద్రాలు కారాదనే సదుద్దేశంతో చేసిన ప్రార్థనా స్థలాల పరిరక్షణ చట్టం-1991 స్ఫూర్తికే విఘాతం కలిగింది. ప్రార్థనా మందిరాల నిర్మాణమూలాలను తెలుసుకోవాలన్న ఒక వర్గం ఉత్సాహం తప్పేమీ కాదంటూ సర్వోన్నత న్యాయస్థానం ఒక దశలో అదాటున చేసిన వ్యాఖ్యలు చివరకు ఇక్కడకు తెచ్చాయి. వివాదం వస్తే చాలు... దేశంలో ప్రతి చిన్న కోర్టూ అనాలోచితంగా సర్వేలకు ఆదేశించేలా ఊతమిచ్చాయి. ఇది అత్యంత దురదృష్టకర పరిణామం. తాజా ఘర్షణలకు కేంద్రమైన సంభల్‌లోని షాహీ జామా మసీదు 16వ శతాబ్దికి చెందిన రక్షిత జాతీయ కట్టడం. వారణాసిలోని జ్ఞానవాపి, యూపీలోని మథురలో నెలకొన్న ఈద్గా, మధ్యప్రదేశ్ లోని ధార్‌లో ఉన్న కమాల్ మౌలా మసీదుల్లో లానే దీనిపై రచ్చ మొదలైంది. అక్కడ కేసులు వేసినవారే ఇక్కడా కోర్టుకెక్కారు. మొఘల్ చక్రవర్తి బాబర్ కాలంలో కట్టిన 3 మసీదుల్లో (పానిపట్, అయోధ్య, సంభల్) ఇదొకటి. ప్రాచీన హరిహర మందిర్ స్థలంలో ఈ మసీదును నిర్మించారని పిటిషనర్ల వాదన. జిల్లా కోర్టులో ఈ నెల 19న కేసు వస్తూనే జడ్జి మసీదులో ఫోటో, వీడియో సర్వేకు ఆదేశిస్తూ, 29వ తేదీ కల్లా నివేదిక సైతం సమర్పించాలన్నారు. తొలి సర్వే ప్రశాంతంగా సాగినా, నవంబర్ 24 నాటి రెండో సర్వే భారీ హింసకు దారి తీసింది. సర్వేకు వచ్చినవారిలో కొందరు జై శ్రీరామ్ నినాదాలు చేశారనీ, దాంతో నిరసనకారులు రాళ్ళురువ్వారనీ వార్త. కాల్పుల్లో అయిదుగురు మరణించారు. అమాయకుల ప్రాణాలు, పట్నంలో సామరస్య వాతావరణం గాలికెగిరి పోయాయి. శతాబ్దాల తరబడి అన్ని వర్గాలూ కలసిమెలసి జీవిస్తున్న చోట విద్వేషాగ్ని రగులుకుంది. ఎన్నో ఏళ్ళుగా ఉన్న అయోధ్య, వారణాసి వివాదాలకు భిన్నంగా సంభల్ కథ చిత్రంగా ఈ ఏడాదే తెర మీదకొచ్చింది. పశ్చిమ యూపీలో సంభల్ జిల్లా మూడు దశాబ్దాలుగా సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)కి కంచుకోట. 1980ల నుంచి అక్కడ అధికారం కోసం బర్?, మెహమూద్ కుటుంబాలు వేర్వేరు పార్టీల పక్షాన పరస్పరం తలపడుతూ వచ్చాయి. తర్వాత 1990ల నుంచి రెండు వర్గాలూ ఎస్పీతోనే అనుబంధం నెరపుతున్నాయి. అధికారంలో పైచేయి కోసం ఒకే పార్టీలోని ఈ రెండు వర్గాల మధ్య పోరాటమే తాజా హింసకు కారణమని బీజేపీ ప్రచారం చేస్తోంది. హిందూ - ముస్లిమ్‌ల తర్వాత, ఇక ముస్లిమ్‌లలోని ఉపకులాల మధ్య చీలికలు తీసుకురావడానికే కాషాయ ధ్వజులు ఈ ప్రచారం చేస్తున్నారని ఎస్పీ ఖండిస్తోంది. మొఘల్ శిల్పనిర్మాణ శైలికి ఈ మసీదు ప్రతీకైతే, ఈ సంభల్ ప్రాంతం విష్ణుమూర్తి పదో అవతారమైన కల్కి వచ్చే ప్రదేశమని హిందువుల నమ్మిక. భిన్న విశ్వాసాల మధ్య సొంత లాభం చూసుకొనే కొందరి రాజకీయంతో సమస్య వచ్చి పడింది. నిజానికి, 1947 ఆగస్ట్ 15కి ముందున్న ధార్మిక విశ్వాసాల ప్రకారమే అన్ని ప్రార్థనా ప్రదేశాలూ కొనసాగాలి. ఒక్క అయోధ్య రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదమే దానికి మినహాయింపని దీర్ఘకాలం క్రితమే కేంద్ర సర్కార్ చేసిన 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టం. అయోధ్య తరహాలో మరిన్ని సమస్యలు రాకూడదన్నది దాని ప్రధానోద్దేశం. ఏ ప్రార్థనా స్థలాన్నీ పాక్షికంగా కానీ, పూర్తిగా కానీ ఒక మతవిశ్వాసం నుంచి మరోదానికి మార్పిడి చేయరాదనీ, చర్చ పెట్టరాదనీ చట్టంలోని 3వ సెక్షన్ స్పష్టంగా నిషేధించింది. అయితే, ప్రార్థనా స్థలాల ప్రాచీన స్వరూపమేమిటో నిర్ధారించడం చట్టవిరుద్ధం కాదంటూ 2002 మేలో జస్టిస్ చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలు వివాదాలకు సందు ఇచ్చాయి. అనేకచోట్ల చిన్న కోర్టులు మందిర- మసీదు వివాదాలపై విచారణ చేపట్టి, పర్యవసానాలు ఆలోచించకుండా హడావిడిగా సర్వేలకు ఆదేశిస్తున్నాయి. సంభల్ ఘటన తర్వాతా అజ్మీర్‌లోని ప్రసిద్ధ షరీఫ్ దర్గాను గుడిగా ప్రకటించాలంటూ దాఖలైన కేసును రాజస్థాన్ కోర్ట్ అనుమతించడం ఓ మచ్చుతునక. సమస్యల్ని తేల్చాల్సిన గౌరవ కోర్టులే ఇలా తేనెతుట్టెల్ని కదిలించడం విషాదం. ప్రార్థనాస్థలాల చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీమ్‌లో ఇప్పటికే నాలుగు పిటిషన్లున్నాయి. దానిపై నిర్ణయానికి కేంద్రం, కోర్ట్ తాత్సారం చేస్తుంటే ఆ లోగా వారణాసి, మథుర, ధార్, సంభల్, తాజాగా అజ్మీర్... ఇలా అనేక చోట్ల అత్యుత్సాహం వ్యక్తమవుతోంది. ఇది శాంతి, సామరస్యాలకు పెను ప్రమాదం. ఈ ప్రయత్నాలను ఆపేందుకు సర్కారు కానీ, సర్వేలపై జోక్యానికి సుప్రీమ్ కానీ ముందుకు రాకపోవడం విడ్డూరం. ఒక వివాదాస్పద స్థలపు ధార్మిక స్వభావ అన్వేషణ చారిత్రక నిర్ధారణ, పురాతత్వ అన్వేషణతో ఆగుతుందనుకుంటే పొరపాటు. అది మత పరంగా, రాజకీయంగా రావణకాష్టమవుతుంది. కాశీ, మథురల్లో, ఇప్పుడు సంభల్ జరుగుతున్నది అదే. 'ప్రతి మసీ దులో శివలింగాన్ని అన్వేషించాల్సిన పని లేదు'ంటూ ఆరెస్సెస్ అధినేత రెండేళ్ళ క్రితం అన్నారు కానీ జరుగుతున్నది వేరు. చిచ్చు అధికార వర్గాల అండదండలతోనే ఈ విభజనరగులుతోందన్నదీ చేదు నిజం. 2019 నవంబర్‌లో ప్రార్థనా స్థలాల చట్టాన్ని సమర్థించిన సుప్రీమ్ మరోసారి గట్టిగా ఆ పని చేయకుంటే కష్టమే. ఓ హిందీ కవి అన్నట్టు, మసీదులు పోనివ్వండి... మందిరాలు పోనివ్వండి... కానీ రక్తపాతం మాత్రం ఆపేయండి. మతాలకు అతీతంగా మనిషినీ, మానవత్వాన్నీ బతకనివ్వండి!

# పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్నవారిపై భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపడం ఆందోళనకరం



పొరుగుదేశమైన పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్నవారిపై భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపడం ఆందోళనకరం. జైలులో ఉన్న మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ (పిటిఐ) అధినేత ఇమ్రాన్‌ఖాన్‌ను విడుదల చేయాలంటూ ఖైబర్ ప్రావిన్స్ ముఖ్యమంత్రి అలీ అమిన్ గండాపుర్, ఇమ్రాన్‌ఖాన్ భార్య బుష్రా బీబీ ఇచ్చిన పిలుపునందుకుని రాజధాని ఇస్లామాబాద్‌కు 'లాంగ్‌మార్చ్' నిర్వహించిన లక్షలాది మంది పిటిఐ మద్దతుదారులపై ప్రభుత్వం అడుగడుగునా నిర్బంధాన్ని ప్రయోగించింది.. వేలాది మంది నిరసనకారులను ముందస్తు అరెస్టులు గావించింది. షిప్పింగ్ కంటైనర్లు, కాంక్రీట్ బారికేడ్లతో ఎక్కడికక్కడ రహదారులను దిగ్బంధించింది. ప్రధాన రహదారులను మూసివేసింది.. మొబైల్, ఇంటర్నెట్ సేవలను బంద్ చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ రాజధాని నగరాన్ని షట్‌డౌన్ చేసింది. ఎంతగా నిర్బంధాన్ని ప్రయోగించినా, ఎన్ని అవరోధాలు కల్పించినా లెక్కచేయకుండా లక్షలాది మంది ఇస్లామాబాద్‌లోని డి చౌక్‌కు చేరుకున్నారు. అక్కడ కూడా ప్రదర్శన నిర్వహించకుండా అడ్డుకోవడంతో భద్రతా దళాలకు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో భద్రతా సిబ్బందితో సహా ఆరుగురు చనిపోయారు. అదే రోజు రాత్రి పెద్దయెత్తున పిటిఐ మద్దతుదారులను అరెస్టు చేశారు. ఈ పరిణామాలతో తాత్కాలికంగా ఆందోళన విరమించుకుంటున్నట్లు జైలు నుంచి ఇమ్రాన్‌ఖాన్ ప్రకటించారు. నిరసనకారుల డిమాండ్లు మాత్రం నెరవేరలేదు. ప్రజాతంత్ర హక్కుల పట్ల పాక్ ప్రజల్లో ఆకాంక్ష ఎంత బలంగా ఉందో తెలియజేయడంలో పిటిఐ నిరసన సఫలమైంది. క్రికెటర్‌గా, పాకిస్తాన్‌కు ప్రపంచకప్‌ను అందించిన ఇమ్రాన్‌ఖాన్ సైనిక కుట్రలకు భయపడి ఇతర పాలకుల్లా దేశం వీడి పారిపోలేదు. వాటిని ఎదిరించి నిలిచినందుకు ఆయన మీద 150కిపైగా క్రిమినల్ కేసులు పెట్టి కటకటాల వెనక్కి నెట్టారు. ఐఎంఎఫ్ ఆర్థిక విధానాలతో ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న పాకిస్తాన్‌లో రాజకీయ సంక్షోభం కూడా తలెత్తకుండా నివారించాల్సిన బాధ్యత పిఎంఎల్(ఎన్), పిపిపి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంపైన, సైన్యంపైన ఉంది. ప్రతిపక్ష నేతను విడుదలజేసేందుకు ప్రభుత్వం, సర్వాధికారిగా వ్యవహరిస్తున్న సైన్యం ససేమిరా అంటున్నాయి. ఇదే ప్రస్తుత పరిస్థితికి కారణం. సైన్యం మద్దతుతోనే ఇమ్రాన్ గద్దెనెక్కినప్పటికీ కొంతకాలం తరువాత తన అస్తిత్వాన్ని చాటుకునేందుకు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేందుకు యత్నించారు. ఈ ధిక్కారాన్ని సైన్యం సహించలేకపోయింది. అదే సమయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇమ్రాన్ చెలిమి చేయడం అమెరికాకు కోపం తెప్పించింది. అమెరికా సామ్రాజ్యవాదం, పాక్ సైన్యం కూడబలుక్కుని 2022లో ఇమ్రాన్ ప్రభుత్వాన్ని కూలదోశాయి. ఇమ్రాన్‌ను జైలులో పెట్టాయి. ఆ పార్టీని నాశనం చేయాలని చూశాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ ఎన్నికల గుర్తు 'క్రికెట్ బ్యాట్' పై నిషేధం విధించాయి. ఎన్నికల్లో రిగ్గింగ్ వంటి పలు అక్రమాలకు సైన్యం పాల్పడింది. అయినప్పటికీ స్వతంత్రులుగా పోటీ చేసిన ఇమ్రాన్ మద్దతుదారులు గణనీయమైన సంఖ్యలో పార్లమెంటులోకి ప్రవేశించారు. ప్రజల్లో ఇమ్రాన్ పట్ల అంతకంతకూ ఆదరణ పెరుగుతున్నదనడానికి తాజా నిరసనలే నిదర్శనం. పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడడానికి ఏ ఐఎంఎఫ్ విధానాలు కారణమో వాటినే మరింతగా అమలు చేయడానికి షెహబాజ్ ప్రభుత్వం పూనుకుంది. 700 కోట్ల డాలర్ల రుణం కోసం ఐఎంఎఫ్‌తో తిరిగి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విధానాలు పాక్ ఎదుర్కొంటున్న అధిక ధరలు, తీవ్ర రూపం దాల్చిన నిరుద్యోగం వంటి సమస్యలను ఏమాత్రం పరిష్కరించలేకపోయాయి. దీంతో ప్రజలు అసంతృప్తితో వీధుల్లోకి వస్తుండడంతో ప్రభుత్వం వీటిని నిరంకుశంగా అణచివేసేందుకు యత్నిస్తున్నది. ఇమ్రాన్ జైలులో నుండి ఇచ్చిన పిలుపునకు ఇంత పెద్దయెత్తున జనం స్పందించడానికి ఇది కూడా ఒక ముఖ్యకారణం. 'నా శత్రువు నోరు విప్పకుండా చేయగల బలం, బలగం, అధికారం నాకు ఉన్నప్పటికీ అతను తన అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను నేను హరించను. చివరికి అతని మాటలు నాపై విమర్శలైనా సరే! అదే ప్రజాస్వామ్యం' అని అబ్రహాంలింకన్ అన్న మాటలు పాక్ పాలకుల చెవికెక్కుతాయా? నిరసనకారుల వాణి విని పరస్పర చర్చల ద్వారా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోడానికి ప్రభుత్వం, సైన్యం సిద్ధం కావాలి. లేకుంటే తరువాత జరిగే పరిణామాలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో బంగ్లాదేశ్, శ్రీలంకలో పరిణామాలు పాక్ పాలకులకు ఒక హెచ్చరిక కావాలి.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com